గమ్యం స్థిరంగా ఉండాలి, ప్రయత్నంలో రాజీ ఉండకూడదు, అప్పుడే విజయం మనదవుతుంది
- రామకృష్ణ పరమహంస

Truth of News
PRGI Reg No: APTEL/26/A4781
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

శ్రీసత్యసాయి | సంపుటి: 02 | సంచిక : 03 | మంగళవారం 11 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# జార్ఖండ్‌లో పోలీసుల దాష్టీకం

- అసెంబ్లీ ముట్టడిలో ఉద్రిక్తత.. రాంచీలో విద్యార్థులపై లాఠీచార్జి
- టియర్ గ్యాస్, వాటర్ కెనాన్ల ప్రయోగం
- పరీక్షల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్



రాంచీ - సూర్య వాస్తవం

ఉద్యోగనియామక పరీక్షల్లో అవకతవకలపై నిరుద్యోగులు భగ్గుమన్నారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ అభ్యర్థులు ఆదివారం రాంచీలో అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. దీంతో నిరసనకారులపై పోలీసుల లాఠీచార్జ్ చేశారు. కాగా, ఈ నిరసనల్లో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వేలాది మంది రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాంచీకి చేరుకుని అసెంబ్లీ భవనం వైపు 'విధాన్ సభ ఘెరావ్' మార్చ్ చేపట్టారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు టియర్ గ్యాస్ షెల్స్, వాటర్ కెనాన్‌లు ప్రయోగించారు.

**ఏం జరిగింది?**

జగన్నాథ్ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించి, కొత్త అసెంబ్లీ కాంప్లెక్స్ వైపు

- మిగతా 2లో..

# తలొగ్గిన ప్రభుత్వం

- అమిత్ షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాల డిమాండ్
- ఆయన సమాధానం ఇస్తారన్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువకులపై పోలీసులు, కేంద్ర బలగాల క్రూరమైన దాడిపై కేంద్రహోం మంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్షం చేస్తున్న డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం తలొగ్గింది. విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన అన్ని ప్రశ్నలకు అమిత్ షా సమాధానమిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు హామీ ఇచ్చారు. "విద్యార్థుల ఆందోళన, దానికి సంబంధించిన ఇతర అంశాలపై కూలంకషంగా చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ అంశంపై జరిగే చర్చకు గానీ, మంత్రి సమాధానానికి గానీ ప్రతిపక్షాలు ఆటంకం కలిగించకూడదు. ప్రభుత్వం, మంత్రి చెప్పే ప్రతి విషయాన్ని వినడానికి మనం సిద్ధంగా ఉండాలి" అని రిజిజు అన్నారు. గత నెల 20న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజున పార్లమెంటుకు ర్యాలీగా వెళ్లిన విద్యార్థులు, యువకులను ఢిల్లీ పోలీసులు, కేంద్ర బలగాలు క్రూరంగా అణచివేసేందుకు ప్రయత్నించడంతో పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగిన విషయం విదితమే.యువకులను పెల్లెట్ గన్లు, మేకులు దింపిన లాఠీలు, ఎలక్ట్రిక్ లాఠీలతో కొట్టారు. సాధారణ దుస్తుల్లో వచ్చిన

- మిగతా 2లో..



## ఆగస్టు 15న ఎర్రకోటపై వందేమాతరం గేయం ఆలాపన

2 లో



## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

- యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన
- పన్నుల సవరణ బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం
- యూపీఐ లావాదేవీలపై వినియోగదారులకు ఛార్జీలు లేవని నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ
- మర్చంట్ డిస్కౌంట్ రేట్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్రం
- భవిష్యత్తులో ఛార్జీలు వచ్చినా వ్యాపారులకే, అదీ పెద్ద లావాదేవీలకే వర్తింపు
- రోజువారీ కొనుగోళ్లు 90 శాతం ఉచితంగానే కొనసాగుతాయని వెల్లడి

2 లో

# అమిత్ షా సభకు రావాలి

- విద్యార్థులపై పోలీసుల దాడి పట్ల ప్రకటన చేయాలి పార్లమెంట్ లో ప్రతిపక్షాల ఆందోళన
- రాజ్యసభలో సభ్యుల వాకౌట్
- ఉభయసభల్లో చెరో బిల్లు ఆమోదం
- లోక్‌సభలో నాలుగు బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్రం




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని, విద్యార్థులపై పోలీసుల దాడి పట్ల ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు, కేంద్ర బలగాల దాడి, అయోధ్య రామమందిరం విరాళాల చోరీకి వ్యతిరేకంగా సోమవారం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. రాజ్యసభలో విపక్షాలు వాకౌట్ చేశాయి. లోక్‌సభను ప్యానెల్ స్పీకర్ ప్రేమచంద్రన్ ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించగా ప్రతిపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు హోరెత్తించారు. జులై 20న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీ గురించి వివరణ ఇవ్వాలని, కేంద్ర మంత్రి అమిత్ షా సభకు రావాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సభ సమావేశమైన కొన్ని సెకన్లలోనే మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే నాలుగు బిల్లులను ప్రవేశపెట్టారు.
న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ బిల్లును, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్మెంట్ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. గనులు, ఖనిజాల సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్ష ఎంపీలు వ్యతిరేకించారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కేరళం పేరు మార్పు బిల్లును హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సవరణ బిల్లును మంత్రి మురళీధర్ మోహల్ ప్రవేశపెట్టారు. అనంతరం సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. దీంతో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ఎటువంటి చర్చ లేకుండానే ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చర్చకు సిద్ధంగా ఉన్నారని, ప్రతిపక్షాలు సభ సజావుగా సాగేందుకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. దీనికి

- మిగతా 2లో..



## భళా ఎమ్మెల్యే షాజహాన్ భాష

- ముస్లింమైనారిటీల అభ్యున్నతి కోసం పాటు పడే మైనారిటీ నాయకుడు
- రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా వక్ఫ్ స్థలాన్ని తీర్చిదిద్దిన వైనం
- అభివృద్ధి పనుల్లో చురుగ్గా

మదనపల్లె - సూర్య వాస్తవం

హజరత్ టిప్పుసుల్తాన్ రహమతుల్లాహి అలై ముస్లింమైనారిటీల అభ్యున్నతి కోసం వక్ఫ్ చేసిన 48 ఎకరాల భూమిలో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా ప్రజా ప్రయోజనం కోసం పూర్తి స్థాయిలో ఒక రూపాన్ని తీసుకొచ్చిన ఘనత మదనపల్లి శాసన సభ్యులు షాజహాన్ బాషా 48 ఎకరాలలో ఇప్పటికే 103 పక్కా షాపింగ్ రూములు 25 మామిడికాయాల మండీలకు నిర్మించి ఇవ్వడమే కాకుండా ప్రస్తుతం 250 కోట్ల రూపాయల

- మిగతా 2లో..

# 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం

- ఏలూరు జిల్లా కలిదిండిలో 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం
- కొత్త పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రికార్డుల తప్పులను సరిదిద్దుతాం
- బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పాస్‌బుక్కులు
- రెవెన్యూ సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని స్పష్టం



కైకలూరు - సూర్య వాస్తవం

రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని, 2027 నాటికి భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ అధికారిక చిహ్నంతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులను రైతులకు, భూయజమానులకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే తమ కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని ఆయన పునరుద్ఘాటించారు. సోమవారం ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో జరిగిన 'మీ భూమి--మీ హక్కు' పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లజర్ల దుర్గాభవాని అనే మహిళా

- మిగతా 2లో..

# హస్త కళాకారులకు అండగా ప్రభుత్వం..

- లాభం లేకుండా కలప సరఫరాకు పవన్ ఆదేశం
- హస్త కళాకారులకు నాణ్యమైన కలప సరఫరాపై పవన్ సమీక్ష
- కేవలం నిర్వహణ ఖర్చులకే కలప అందించాలని ఆదేశం
- రాష్ట్రంలోని ఆరు ప్రాంతాల్లో క్రాఫ్ట్ వుడ్ బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు
- దళారుల వ్యవస్థను నిర్మూలించి, కళాకారులకు అండగా నిలవడమే లక్ష్యం



అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్రంలోని సంప్రదాయ హస్తకళాకారులకు అండగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి అవసరమైన నాణ్యమైన కలపను ఎటువంటి లాభాపేక్ష లేకుండా, అసలు ధరకే అందించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 'క్రాఫ్ట్ వుడ్ బ్యాంకుల' ఏర్పాటుపై సోమవారం

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# తలొగ్గిన ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు యువతులతో దురుసుగా ప్రవర్తించారు. జంతర్‌మంతర్ వద్ద యువకులను అక్రమంగా రవాణా చేసిన ఘటనపై అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు గత 16 రోజులుగా ఉభయ సభల్లోనూ నిరసన తెలుపుతున్నాయి. అయితే, అమిత్ షా ఇప్పటివరకు సభకు రావడానికి గానీ, వివరణ ఇవ్వడానికి గానీ సిద్ధంగా లేరు. ప్రతిపక్షాల మనోభావాలను అర్థం చేసుకోవాలని రాజ్యసభ చైర్మెన్ సిపి రాధాకృష్ణన్ ఇచ్చిన సూచనలను కూడా అమిత్ షా పట్టించుకోలేదు. అయినప్పటికీ, అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇచ్చే వరకూ నిరసన కొనసాగుతుందని ప్రతిపక్షాలు తమ వైఖరిలో దృఢంగా ఉన్నాయి. గురువారంతో వర్షాకాల సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో... హోం మంత్రి సరైన వివరణ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయింది. ఈ పరిస్థితిలో అమిత్ షా పార్లమెంటుకు వచ్చి వివరణ ఇవ్వక తప్పలేదు.

# హస్త కళాకారులకు అండగా ప్రభుత్వం..

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. కలప సేకరణ, రవాణా, నిల్వకు అయ్యే వాస్తవ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తూ చేతివృత్తుల వారికి ముడిసరుకును సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ముడిసరుకు కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కళాకారులకు ఈ వుడ్ బ్యాంకులు ఒక భరోసాగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రక్రియలో దళారుల ప్రమేయాన్ని పూర్తిగా తొలగించడం ద్వారా కళాకారుల ఉత్పత్తి వ్యయం తగ్గి, వారికి ఆర్థిక భరోసా లభిస్తుందని వివరించారు. రాష్ట్రంలోని కొండపల్లి, ఏటికొప్పాక, సెట్టిగుంట, మాధవమాల, ఉదయగిరి, బొబ్బిలి వంటి ఆరు ప్రధాన కేంద్రాల్లో ఈ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను ఏర్పాటు చేయనున్నారు. కొండపల్లి బొమ్మలకు అవసరమైన తెల్లపొనికి, ఏటికొప్పాక హస్తకళలకు వినియోగించే అంకుడు, బొబ్బిలి వీణల తయారీకి వాడే పనస, రోజ్‌వుడ్ వంటి కలపను ఈ బ్యాంకుల ద్వారా సరఫరా చేస్తారు. అలాగే, రాజమండ్రి సెంట్రల్ వుడ్ బ్యాంకులో వెదురు, టేకు వంటివి అందుబాటులో ఉంటాయి. అరుదైన కలప జాతుల లభ్యతను మ్యాపింగ్ చేసి, వాటిని అటవీ నర్సరీలలో సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని పవన్ అధికారులను ఆదేశించారు.

### ఆగస్టు 15న ఎర్రకోటపై

# వందేమాతరం గేయం ఆలాపన

హైదరాబాద్ – సూర్య వాస్తవం

80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాల వేళ మొట్టమొదటి సారి వందేమాతర గేయాన్ని ఎర్రకోటపై ఆలపించనున్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగే సంబరాల్లో ఆ గేయాన్ని పాడనున్నారు. రక్షణ శాఖ కార్యదర్శి ఆర్‌కే సింగ్ దీనికి సంబంధించిన ప్రకటన చేశారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు నిండిన సందర్భంగా కూడా ఈ ప్రత్యేక గీతాలాపన చేపట్టనున్నారు. యువశక్తి ఫోకస్‌తో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను నిర్వహించనున్నారు. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరం గేయాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో ఆ గేయాన్ని చేర్చారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది. ఇటీవలే పార్లమెంట్‌లో వందేమాతరం గేయంకు సంబంధించిన బిల్లును పాస్ చేశారు. ఆ చట్టం ప్రకారం.. వందేమాతరం గేయాన్ని అవమానిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొన్నిసార్లు జరిమానా కూడా విధిస్తారు. వందేమాతరం రాసి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ బిల్లును, ఆ గేయానికి గౌరవ సూచకంగా ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది.

# భళా ఎమ్మెల్యే షాజహాన్ భాష





(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు ఇందులో భాగంగా పేదలకు అందుబాటులో ఉండేవిధంగా కులామతాలకు అతీతంగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ షాహిన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సహకారంతో జూనియర్ కాలేజి భవిష్యత్తులో ఉన్నత చదువులకు అనుగుణంగా నిర్మాణం స్కిల్ డెవలప్మెంట్ చేతి వృత్తులు రాయలసీమలోనే లేని విధంగా మసీదు నిర్మాణం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఎంఎల్ఏ ఆఖ్వానంతో పరిశీలించడానికి సూర్య వాస్తవం చైర్మన్ రాష్ట్ర మైనారిటీ నాయకులు ఎన్ ఆరిఫ్ అలి, బెంగళూరు మర్కజ్ పెద్దలు సయ్యద్ జమాల్ సాహబ్ ఆఫ్సర్ ఖాద్రి, ముఫ్తి ఫుజయిల్ అన్సారి, షాహీన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థపాక అధ్యక్షులు, హాజీ అబ్దుల్ ఖదీర్, సూర్య వాస్తవం చీఫ్ ఎడిటర్ ఇర్షాద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



# అమిత్ షా సభకు రావాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష ఎంపీ కె.సి వేణుగోపాల్ స్పందిస్తూ చర్చకంటే ముందు విద్యార్థులపై క్రూరమైన దాడి గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సభను నేటి(మంగళవారం)కి వాయిదా వేశారు. సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి లోక్‌సభ కార్యక్రమాలు ప్రతి రోజూ వాయిదాపడుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు ఎనిమిది బిల్లులు ప్రవేశపెట్టగా ఆరు బిల్లులు ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదం పొందాయి.

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ "దాదాపు 20 రోజులు గడిచినా సమాధానం చెప్పేందుకు అమిత్ షా పార్లమెంటుకు రాలేదు. చర్చ కోసం ప్రతిపక్షం ప్రవేశపెట్టిన ప్రతి తీర్మానాన్ని తిరస్కరించారు. ఆయన మౌనం పొరపాటు కాదు.. అది హింసకు ఆమోదం తెలపడమే. ఆయన దోషి అయినా అయి ఉండాలి లేదా అసమర్థుడైనా అయి ఉండాలి. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని మేము డిమాండ్ చేస్తున్నాం. ఆయనను జవాబుదారీగా నిలబెట్టే వరకు మా పోరాటం ఆగదు" అని అన్నారు.

**రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్**

మరోవైపు రాజ్యసభలో కూడా అదే పరిస్థితి నెలకొంది. సభను ప్రారంభించిన వెంటనే ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి.

దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. రామ మందిర విరాళాల చోరీపై ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. రామ మందిర విరాళాల చోరీ, నిరసనకారులపై పెల్లెట్ గన్‌ల వాడకం వంటి అంశాలను లేవనెత్తేందుకు ప్రయత్నించగా చైర్మెన్ అనుమతించక పోవడంతో ప్రతిపక్ష పార్టీల సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అదే సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'ది బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు–2026'ను సభలో చర్చకు ప్రవేశపెట్టారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు హోరెత్తించారు. ప్రతిపక్షాల ఆందోళనతో డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ వెంటనే సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు.

మధ్యాహ్నం 2.15 గంటలకు సభ తిరిగి సమావేశం కాగా వలసవాద కాలం నాటి చట్టం స్థానంలో కొత్త చట్టం తీసుకువచ్చే బిల్లును నిర్మలా సీతారామన్ చర్చకు పెట్టారు. అయితే ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కొన్ని అంశాలను లేవనెత్తాలని ప్రయత్నించగా, ఎంపీలు కేవలం బిల్లుపై మాత్రమే మాట్లాడాలని సభాపతి స్పష్టం చేశారు. చర్చ అనంతరం బిల్లును ఆమోదించి, సభను నేటి (మంగళవారం)కి వాయిదా వేశారు.

**రామ మందిర విరాళాల చోరీపై ఆందోళన**

అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీ, విద్యార్థులపై పోలీసుల దురాగతాలకు నిరసనగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. సోమవారం పార్లమెంట్ ఆవరణలో జరిగిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, సీపీఐ(ఎం)ఎంపీలు జాన్ బ్రిట్టాస్, వి.శివదాసన్ తో సహా ప్రతిపక్ష ఎంపీలు పాల్గొన్నారు.

పేపర్ లీక్ అంశంపై గత నెల 20న జరిగిన విద్యార్థుల ఆందోళనలో పోలీసులు దురాగతాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై హోం మంత్రి అమిత్ షా తప్పనిసరిగా పార్లమెంటుకు వచ్చి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని, ఎంపీలు పార్లమెంట్ మకర ద్వారం ముందు 'చందా చోర్.. గద్దె చోడ్ ', 'అమిత్ షా జవాబ్ దో', 'బీజేపీకే దఫ్తర్ మే, చందా చోర్ కహా మిలేంగే' వంటి నినాదాలు హోరెత్తించారు. రామ మందిరంలో విరాళాల అక్రమ రవాణా జరిగిందన్న ఆరోపణలకు ప్రతీకగా ఎంపీలు ఆ ప్రదేశంలో ఒక విరాళాల పెట్టెను ఉంచి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దాని చుట్టూ బారులు తీరారు. ప్రతిపక్ష ఎంపీలు, 'అమిత్ షా జవాబ్ దో' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్ వెనుక బారులు తీరి, హోం మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# జార్ఖండ్‌లో పోలీసుల దాష్టీకం

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు వరుసగా ఆరు రౌండ్ల టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. ఈ ఘర్షణలో కొంతమంది గాయపడగా, ఒకరికి పోలీసు లాఠీ దెబ్బ తలకు తగిలింది. రాంచీ డీఎస్పీ అజయ్ ఆర్యన్ మాట్లాడు తూ... నిరసనకారులపై ఎలాంటి బలప్రయోగమూ చేయవద్దని కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయనీ, జనసమూహాన్ని నియంత్రించేందుకు మాత్రమే వెనక్కి నెట్టామనీ, దీనిని లాఠీచార్జి కాదంటూ చెప్పుకొచ్చారు. తక్కువ ప్రభావం ఉండేలా పక్కకు టియర్ గ్యాస్ ప్రయోగించామని ఆయన వివరణ ఇచ్చారు.

**తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష**

జార్ఖండ్ లోక్తాంత్రిక్ క్రాంతికారీ మోర్చా (జేఎల్‌కేఎం) నేత దేవేంద్ర నాథ్ మహతో గత తొమ్మిది రోజులుగా నిరాహార దీక్షలో ఉన్నారు. ఇప్పటికే 10.5 కిలోల బరువు కోల్పో యినప్పటికీ... అంబులెన్స్‌లో వచ్చి మార్చ్‌లో పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతబట్టుకుని ఆయన నిరసనలో పాల్గొనడం గమనార్హం. "మేము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నాం... నా ఆరోగ్యం క్షీణిస్తోంది" అని ఆయన చెప్పారు.

**ఇంకా తీరని డిమాండ్లు**

ఆదివారం జరిగిన చర్చల అనంతరం, 14వ జేపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష, అలాగే 2023, 2025లో నిర్వహించిన జేపీఎస్సీ బ్యాక్‌లాగ్ పరీక్షలను రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. జేపీఎస్సీ సభ్యులు ముగ్గురూ రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ "పూర్తి పారదర్శకతతో న్యాయం జరుగుతుంది" అని హామీ ఇచ్చారు. అయితే, జేఎస్ఎస్సీ–సీజీఎల్ పరీక్షలో అవకతవకలపై సీబీఐ దర్యాప్తు జరపాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రయివేట్ లిమిటెడ్ ఏజెన్సీకి సంబంధించిన అన్ని పరీక్షలనూ రద్దు చేయాలని జేపీఎస్సీ–జేఎస్ఎస్సీ సంస్కరణల వేదిక డిమాండ్ చేస్తోంది. "ప్రభుత్వం మా 98 శాతం డిమాండ్లను అంగీకరించిందని చెబుతోంది, కానీ వాస్తవానికి మేము కోరిన 13 పరీక్షల్లో కేవలం మూడింటిని మాత్రమే రద్దు చేసేందుకు ఒప్పుకుంది" అని నిరసనకారులు తెలిపారు. "సీబీఐ దర్యాప్తు కోసం మా డిమాండ్ నెరవేరేవరకు మేము రాజీ పడం" అని నేతలు స్పష్టం చేశారు.

**జేపీఎస్సీ చైర్‌పర్సన్ అరెస్టు**

నియామక పరీక్షల్లో అవకతవకలకు సంబంధించి జేపీఎస్సీ మాజీ చైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్టేను జార్ఖండ్ సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. గత నెల 28 నుంచి ఆయనను నాలుగుసార్లు పోలీసలు విచారించారు. జేఎస్ఎస్సీ–సీజీఎల్ పరీక్షలో అవకతవకలపై రాష్ట్ర పోలీసుల సీఐడీ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ తో పాటు పలు ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని, మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు ప్రారంభించింది. భద్రతా ఏర్పాట్లు అసెంబ్లీ ప్రాంగణం చుట్టూ 750 మీటర్ల పరిధిలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు విధించారు. జగన్నాథ్ ఆలయం వద్ద రేజర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దాదాపు 1,500 మంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్, జిల్లా పోలీసు, క్యూఆర్‌టీ సిబ్బందిని మోహరించారు. నగరంలోని చాలా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ ఆందోళన 17వ రోజుకు చేరుకుంది. ముఖ్యంగా గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల యువతకు ప్రభుత్వ ఉద్యోగాలే ప్రధాన జీవనోపాధి మార్గంగా ఉన్నందున, ఈ పరీక్షల్లో అవకతవకలు వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని విద్యార్థి నేతలు వాదిస్తున్నారు. "మేము విద్యార్థులం, మా ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నాం కాబట్టి, మేము క్రమశిక్షణ కలిగినవారమని, విద్యావంతులమని నిరూపిం చుకోవాలి" అని నిరసనకారుల నేత రవీంద్ర పాశ్వాన్ మార్చ్‌కు ముందు పిలుపునిచ్చారు. ఇరువైపుల నుంచి ఆరోపణలు కొనసాగుతున్నప్పటికీ, ప్రభుత్వం, నిరసనకారుల మధ్య సీబీఐ దర్యాప్తు అంశంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది.

### 2027 నాటికి భూముల

# రీసర్వే పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రైతుకు అధికారిక చిహ్నంతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బుల్లెట్ వేగంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు కేటాయించిన భూములను సెక్షన్ 22–ఎ పరిధిలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించి వారికి పట్టాలు అందించిందని గుర్తుచేశారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు**

2019–2024 మధ్య గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం రెవెన్యూ రికార్డులను తీవ్రంగా దెబ్బతీసిందని చంద్రబాబు ఆరోపించారు. భూములు, ఆస్తులను డిజిటల్‌గా 22–ఎ పరిధిలోకి తెచ్చి వివాదాలు సృష్టించారని మండిపడ్డారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భూ రికార్డులను శుభ్రపరిచి, క్రమబద్ధీకరించేందుకు 'రెవెన్యూ రికార్డ్స్ రిఫార్మ్స్ 2026'ను ప్రవేశపెట్టినట్లు వివరించారు.

**పటిష్ఠ భద్రతతో కొత్త పాస్‌బుక్కులు**

కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌బుక్కులలో కరెన్సీ నోట్లకు వినియోగించే తరహాలోనే పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని సీఎం తెలిపారు. ఆస్తుల వివరాలను మార్చేందుకు వీలులేకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని, దీనికి అదనంగా క్యూఆర్ కోడ్ వంటి సాంకేతిక భద్రతా ఫీచర్లను పొందుపరిచామన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహిస్తూ, వారి ఈ–కేవైసీ తీసుకున్నాకే గ్రామసభలు పెట్టి పారదర్శకంగా పాస్‌బుక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పటివరకు 32.22 లక్షల పట్టాదారు పాస్‌బుక్కులు రైతులకు, భూ యజమానులకు అందజేశామని, రాబోయే ఏడు నెలల్లో 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్‌బుక్కులు జారీ చేస్తామని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 41,000 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించడం ద్వారా 1.27 లక్షల మంది రైతులకు, పరిశ్రమలకు, ప్రజలకు లబ్ధి చేకూర్చామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారు సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని గుంటూరు ఘటనను ఉదా హరణగా చూపిస్తూ హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో భాగంగా రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేసి, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు.

# పన్నుల బిల్లుకుపార్లమెంట్ ఆమోదం..

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారులకు ఎటువంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సందర్భంగా ఆమె ఈ కీలక ప్రకటన చేశారు. గత వారం లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును, సోమవారం రాజ్యసభ సైతం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ సవరణ ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎటువంటి లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించడం లేదని ఆమె సభకు విస్పష్టంగా తెలిపారు. మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపుపై వెలువడుతున్న ఊహాగానాలపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్టీరింగ్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎటువంటి ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయలేదని వెల్లడించారు.

భవిష్యత్తులో ఒకవేళ ఎండీఆర్‌ను ప్రవేశపెట్టినా, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన అధిక విలువ గల వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని ఆర్థిక శాఖ గతంలోనే స్పష్టం చేసింది. పాలు, కూరగాయలు, కిరాణా వంటి 90 శాతానికి పైగా రోజువారీ కొనుగోళ్లు వ్యాపారులకు కూడా ఉచితంగానే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. 2016లో ప్రారంభమైన యూపీఐ, 2020 జనవరి నుంచి ఉచిత సేవలను అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్–టైమ్ చెల్లింపు వ్యవస్థగా అవతరించింది.

## సంపాదకీయం

# ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లులో బిగ్ ట్విస్ట్




భారతదేశంలో చట్టాలు రూపొందించడం, వాటిపై చర్చించడం పార్లమెంటు, రాజకీయ పార్టీల నేతల పరిధిలోనిదే. అభ్యంతరాలు ఉంటే అవి సభల్లోనే వ్యక్తం కావాలి. దీనికి విరుద్ధంగా విదేశీ నేతలు స్పందించడం అంతర్గత వ్యవహారాల్లో జోక్యంగా పరిగణించ బడుతుంది. ఇటీవల ఎఫ్‌సీఆర్‌ఏ సంబంధిత బిల్లు విషయంలో ఇదే సూత్రాన్ని భారత్ స్పష్టం చేసింది.ఈ బిల్లు విదేశీ నిధుల రాకపోకలపై నియంత్రణను మరింత కఠినం చేసే దిశగా ఉంది. సంస్థలు నిధుల మూలాలు, ఖర్చుల వివరాలు స్పష్టంగా నివేదించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆస్తులు జప్తు చేసే అధికారం కేంద్రానికి ఉంటుంది. దీని ద్వారా అంతర్గత భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై నియంత్రణ సాధ్యమవుతుందని ప్రభుత్వ వైపు నుంచి వాదన ఉంది. రాజకీయ చర్చలు ఈ అంశం చుట్టూనే తిరగనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఈ బిల్లు ఆమోదంపై దృఢంగా ఉన్నారని సూచనలు వస్తున్నాయిఈ ప్రక్రియపై అమెరికా సెనేటర్ రైలీ మూర్ వ్యతిరేకత వ్యక్తం చేశారు. భారత్‌లో క్రై స్తవులు సెయింట్ థామస్ కాలం నుంచి ఉన్నారని, వేల సంవత్సరాల చరిత్ర ఉందని చెబుతూ, ఎఫ్‌సీఆర్‌ఏ ద్వారా వారిని నియంత్రించాలని ప్రయత్నం జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నంగా కనిపించాయి. అయితే అమెరికాలోనే అమలులో ఉన్న ఇలాంటి నియంత్రణల గురించి ఆయన ప్రస్తావించలేదు. భారత్ నుంచి అమెరికాలోని ఇస్కాన్ వంటి సంస్థలకు నిధులు వెళ్తే అవి అమెరికా నిబంధనలకు లోబడి లెక్కలు చూపాల్సి ఉంటుంది. ఇదే తరహా జవాబుదారీతనం భారత్‌లోనూ అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ బిల్లు వస్తోంది.విదేశీ వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందించారు. ఇది పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని, బయటివారు స్పందించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇలాంటి స్పష్టత అమెరికాకు అసౌకర్యం కలిగించవచ్చు. యూరప్ నేతలు కూడా ఇలాంటి సందర్భాల్లో సాధారణంగా జాగ్రత్తగా ఉంటారు. అయినా భారత్ తన సార్వభౌమత్వాన్ని నొక్కి చెప్పింది. రైలీ మూర్ ట్రంప్‌కు సన్నిహితుడని, ఆయన ద్వారా సందేశం వస్తున్నట్లు కొందరు అంచనా వేస్తున్నా, అధికారికంగా ఇది ఒక సెనేటర్ వ్యక్తిగత అభిప్రాయంగానే చూడాలి.ప్రతి దేశం తన భద్రత, నిధుల పారదర్శకత కోసం చట్టాలు తీసుకురావడం సహజం. వివాదాస్పద విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు?2026పై కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. ఈ బిల్లును గత కాలానికి (రెట్రోస్పెక్టివ్‌గా) వర్తింపజేయబోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లు మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా వెల్లడించారు. మిజోరం చర్చి నాయకుల ప్రతినిధి బృందంతో కలిసి అమిత్ షాను కలిసిన అనంతరం ఆయన ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు. ఈ బిల్లును ఆగస్టు 12న పార్లమెంట్‌లో చర్చించి ఆమోదానికి తీసుకురానున్నట్లు హోంమంత్రి వెల్లడించినట్లు చెప్పారు.ప్రతిపాదిత ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు విదేశీ నిధులు స్వీకరించే స్వచ్ఛంద సంస్థలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రద్దు అయిన, గడువు ముగిసిన లేదా స్వచ్ఛందంగా వదులుకున్న సంస్థలకు చెందిన విదేశీ నిధులు, వాటితో కొనుగోలు చేసిన ఆస్తులను ప్రభుత్వం నియమించే ప్రత్యేక అధికార సంస్థ ఆధీనంలోకి తీసుకునే విధంగా కొత్త నిబంధనలు తీసుకురావాలని బిల్లు ప్రతిపాదిస్తోంది.అయితే ఈ చట్టాన్ని గతానికి వర్తింపజేస్తే నిజాయితీగా పనిచేస్తున్న సంస్థలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా, మిజోరం కోహ్రాన్ హ్రుయితు కమిటీ, మిజోరం చర్చిల మండలి ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పరిపాలనా లేదా సాంకేతిక లోపాల కారణంగా స్వచ్ఛంద సంస్థలు శిక్షార్హులుగా మారే అవకాశం ఉందని పేర్కొంటూ, ఈ చట్టాన్ని భావి కాలానికి మాత్రమే వర్తింపజేయాలని కేంద్రాన్ని కోరారు. దీనిపై స్పందించిన అమిత్ షా, బిల్లు గతానికి వర్తించదని హామీ ఇచ్చినట్లు లాల్దుహోమా తెలిపారు.ఇదే సమయంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభనను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసింది. కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుతో పాటు ఇతర చట్టాలపై చర్చ జరిగేలా ప్రతిపక్షాలతో సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో ఫోన్‌లో మాట్లాడి సహకారం కోరారు. గత పది రోజుల్లో పలుమార్లు ఇరు నేతల మధ్య చర్చలు జరిగినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.కాంగ్రెస్ మాత్రం కీలక బిల్లులపై ముందుగా అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. అయితే దీనిపై కేంద్రం ఇప్పటివరకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. మరోవైపు 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసే దిశగా రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రభుత్వం ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నాలు చేస్తోంది. అలాగే 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాలను 543 నుంచి 816కు పెంచే డీలిమిటేషన్ ప్రతిపాదనపైనా రాజకీయ పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ కీలక బిల్లులపై ఆగస్టు 12న జరిగే పార్లమెంట్ చర్చ దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అమెరికా తన భూభాగంలో విదేశీ నిధులపై నియంత్రణలు పెట్టుకుంటే, భారత్‌లోనూ అదే హక్కు ఉంది. ఒకవైపు స్వేచ్ఛ, మత స్వాతంత్ర్యం గురించి మాట్లాడుతూ, మరోవైపు మరొక దేశం యొక్క నియంత్రణ చర్యలను లక్ష్యంగా చేసుకోవడం ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తుంది. ఎఫ్‌సీఆర్‌ఏ కేవలం ఒక మతాన్ని లక్ష్యం చేసుకోవడం కాదు.. అన్ని సంస్థలకు వర్తించే సాధారణ నిబంధనలు. అంతర్గత శత్రువులు లేదా అపారదర్శక నిధుల మార్గాలను అడ్డుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం. మొత్తంగా చూస్తే, ఈ వివాదం భారత్ తన స్వాతంత్ర్యాన్ని, చట్టపరమైన సార్వభౌమ త్వాన్ని ఎలా కాపాడుకుంటుందో చూపిస్తోంది. విదేశీ అభిప్రాయాలు ఉండవచ్చు, కానీ నిర్ణయాలు భారత ప్రజలు, వారి ప్రతినిధులు తీసుకోవాలి. ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లు ఆమోదం పొందితే నిధుల పారదర్శకత పెరుగుతుంది.

# లబ్ధిదారుల స్థలాలలో రాళ్లు, బండలు...!

- 374 కుటుంబాలకు కేటాయించిన స్థలాలపై ఆక్రమణ యత్నాల ఆరోపణలు
- ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని అధికారులకు లబ్ధిదారుల వినతి
- సమస్య త్వరగా పరిస్కారం కాకుంటే రిలే నిరాహార దీక్ష చేస్తామన్న వెంకట ప్రసాద్
- పేదల పక్షాన తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ మున్సిపల్ కార్పొరేటర్ వెంకట ప్రసాద్



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని ల14వ డివిజన్ (పాత వార్డు)లికు సంబంధించిన గృహ స్థలాల విషయంలో వివాదం నెలకొంది. ఉప్పువల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 51-2, 146-2, 64-2, 147-2లో మొత్తం 374 మంది గృహ లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో కొంతమంది రాళ్లు, బండలు వేసి స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో అనధికారికంగా రాళ్లు, బండలు వేసిన ఘటనపై ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు అధికారిక పత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 20న నగర పాలక సంస్థ కమిషనర్‌కు, ఆగస్టు 5న నగర పాలక సంస్థ అధికారులకు, ఆగస్టు 6న రూరల్ తహసీల్దార్‌కు ఈ అంశంపై సమాచారం అందించినట్లు వివరించారు.స్థలాలను రక్షించాలి తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని 374 మంది లబ్ధిదారులు కోరుతున్నారు. కేటాయించిన స్థలాలను గుర్తించి, వాటికి రక్షణ కల్పించడంతో పాటు అనధికారికంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.గృహ స్థలాలు కేటాయించినప్పటికీ వాటిని వినియోగించుకునే పరిస్థితి లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు వరుసగా వినతులు అందించిన నేపథ్యంలో సమస్యను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 374 మంది లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలపై జరుగుతున్న పరిణామాలపై నగర పాలక సంస్థ, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# పీజీఆర్ఎస్ పిటీషన్లకు చట్టబద్ధమైన పరిష్కారం చూపాలి

- 106 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ పి. జగదీష్
- ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా విచారించి న్యాయం చేయాలని ఆదేశం
- విచారణ పూర్తయిన వెంటనే పిటీషనర్లకు సమాచారం ఇవ్వాలి



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా ఎస్పీ పి. జగదీష్ స్వయంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 106 పిటీషన్లు స్వీకరించినట్లు జిల్లా పోలీస్ శాఖ వెల్లడించింది. ప్రజలు అందజేసిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువులోగా విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.అలాగే, ఫిర్యాదులపై విచారణ పూర్తయిన అనంతరం పిటీషనర్లకు తప్పనిసరిగా సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, పారదర్శకంగా విచారణ చేపట్టి పరిష్కారం చూపాలని ఆయన స్పష్టం చేశారు.

**పీజీఆర్ఎస్ కు వచ్చిన వారికి ఉచిత భోజనం**

పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తమ సమస్యలను తెలియజేసేందుకు వచ్చిన పిటీషనర్లు, వారి వెంట వచ్చిన వారికి ఇస్కాన్ సహకారంతో ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు అభినందనలు తెలిపారు.



# ఆర్ఐఓ నాయక్‌పై అవినీతి ఆరోపణలు

- అనధికారిక జూనియర్ కళాశాలలకు అండగా నిలుస్తున్నారంటూ ఆరోపణలు
- పీజీఆర్ఎస్‌లో ఎన్టీఎఫ్ ఫిర్యాదు..
- విచారణకు ఆర్జేడీకి డీఆర్ఓ ఆదేశం
- అధిక ఫీజుల వసూళ్లపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



**అనంతపురం విద్య - సూర్య వాస్తవం :** జిల్లాలో అనధికారికంగా నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలను, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న విద్యాసంస్థలను ప్రోత్సహిస్తున్నారంటూ ఆర్ఐఓ నాయక్‌పై నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్టీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి గుజ్జల లక్ష్మణ్‌కుమార్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్ఐఓపై వచ్చిన ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని ఆర్జేడీకి జిల్లా రెవెన్యూ అధికారి మలోల సూచించినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గుజ్జల లక్ష్మణ్‌కుమార్ తన ఫిర్యాదును సమర్పించారు. జిల్లాలో కొన్ని జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా కళాశాలల నిర్వహణ జరుగుతున్నా వాటిపై పర్యవేక్షణ కొరవడిందని, కొన్ని కళాశాలల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం పడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ఆర్ఐఓ పాత్రపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరారు.విద్యా వ్యవస్థలో నిబంధనల అమలు విషయంలో అధికారులు నిష్పక్షపా తంగా వ్యవహరించాలని ఎన్టీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆరోపణలు వాస్తవ మా? కాదా? అన్నది ఉన్నతాధికారుల విచారణలో తేలాల్సి ఉంద న్నారు. విచా రణకు ఆదేశాలు ఫిర్యాదుపై స్పందించిన డీఆర్ఓ మలోల.. ఆర్ఐఓపై వచ్చిన ఆరోపణలను పరిశీలించి, అవసరమైన విచారణ చేపట్టి తగిన చర్యల కోసం ఆర్జేడీకి సూచించినట్లు ఫిర్యాదుదారులు వెల్లడించారు. ఆర్ఐఓపై వచ్చిన ఆరోపణలపై ఉన్నత స్థాయి విచారణ జరగనున్న నేపథ్యంలో విద్యాశాఖలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తే తదను గుణం గా చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఎన్టీఎఫ్ నాయకులు పేర్కొన్నారు.పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన వారిలో ఎన్టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ఎన్టీఎఫ్ నాయకులు ఉన్నారు. గమనిక: ఆర్ఐఓపై వచ్చిన అవినీతి ఆరోపణలు ప్రస్తుతం ఫిర్యాదు స్థాయిలోనే ఉన్నాయి. అధికారిక విచారణలో వాస్తవాలు నిర్ధారణ కావాల్సి ఉంది

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- రామ్ నగర్ క్యాంపు కార్యాలయంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజాదర్బార్**
**- ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకున్న మంత్రి పయ్యావుల కేశవ్**
**- ప్రతి సమస్యను బాధ్యతగా పరిష్కరించాలని అధికారులకు సూచన**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** రామ్ నగర్‌లోని ఆర్థిక మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను మంత్రికి వివరించగా, ప్రతి సమస్యను పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను బాధ్యతగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# గుత్తి టౌన్ జాయింట్ కన్వీనర్‌గా మిద్దె ఓబులేష్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి అనంతపురం జిల్లా మెగా యూత్ ఫోర్స్ సోమవారం జరిగిన మెగా యూత్ ఫోర్స్ అనంతపురం జిల్లా కమిటీ సమావేశంలో గుత్తి టౌన్ కన్వీనర్‌గా అలివేలు ధరణి కుమార్‌ని, అలాగే గుత్తి టౌన్ జాయింట్ కన్వీనర్‌గా మిద్దె ఓబులేష్ నియమించారు. ఈ నియామకానికి సంబంధించిన అపాయింట్‌మెంట్ లెటర్లను అనంతపురం జి ల్లా మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ ఇమామ్ హుస్సేన్ మరియు జాయింట్ కన్వీనర్ బోయగడ్డ బ్రహ్మయ్య అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అలివేలు ధరణి కుమార్‌కి, మిద్దె ఓబులేష్‌కి హృదయపూర్వక అభినందనలు మెగా యూత్ ఫోర్స్ బలోపేతానికి, యువతను ఏకం చేస్తూ మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు.

# విశేష పూజలు అందుకున్న భోగేశ్వరుడు



**పామిడి- సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలో ప్రసిద్ధి చెందిన పురాతన భోగేశ్వరస్వామికి ప్రదాన పురోహితులు రామేశ్వరస్వామి, చంద్రమౌళి, అనిల్ విశేష పూజలు నిర్వహించారు. ఆషాడ మాసం చివరి సోమవారంను పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో నిష్టగరిష్టులై పెద్ద ఎత్తున భక్తులు మోహరించి స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజామ నుంచి సర్వ అభిషేకాలు నిర్వహించి పూల మాలలతో అలంకరించి ప్రత్యేకంగా బిళ్వపత్రి అభిషేకాలు చేయించారు. భక్తులు పూలు పండ్లు కొబ్బరికాయలు సమర్పించుకున్నారు. దేవాలయ ఆవరణమంతా శివనామ స్మరణతో మార్మోగింది. అనంతరం అర్చకులు మహా మంగళారతి కావించారు.

# చైన్ స్నాచింగ్‌పై ప్రజలకు అవగాహన సదస్సు

**- ఎస్ఐ సురేష్ కుమార్**

**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణం గుత్తి ఆర్ ఎస్ కేపీఎస్ ఫ్యాక్టరీ రోడ్‌లో చైన్ స్నాచింగ్ పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుత్తి ఎస్ ఐ సురేష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాల్సిందే!

**- అనంతపురంలో వెటరన్ జర్నలిస్టుల భారీ ధర్నా**
**- 19 రాష్ట్రాల్లో అమలు చేస్తున్నప్పుడు.. ఏపీలో ఎందుకు ఆలస్యం?**
**- డిమాండ్ పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక**
**- సమాచార శాఖ ఏడీకి వినతిపత్రం అందజేత**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** సుదీర్ఘకాలం ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములై, ప్రజలకు నిరంతరం సమాచారాన్ని అందించిన సీనియర్ జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో తక్షణమే గౌరవప్రదమైన పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వెటరన్ జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. జిల్లా వెటరన్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం నగరంలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలకొండయ్యకు అందజేశారు.

**జర్నలిస్టుల సేవలను ప్రభుత్వం గుర్తించాలి**

ఈ సందర్భంగా వెటరన్ జర్నలిస్టులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ జీవితాలను పాత్రికేయ వృత్తికి అంకితం చేసిన సీనియర్ జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. వయసు పైబడిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకు పెన్షన్ పథకం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

**19 రాష్ట్రాల్లో అమలు.. ఏపీలో ఎందుకు ఆలస్యం?**

దేశంలోని 19 రాష్ట్రాల్లో ఇప్పటికే సీనియర్ జర్నలిస్టులకు వివిధ రూపాల్లో పెన్షన్ పథకాలు అమలవుతున్నాయని వారు తెలిపారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి, వృద్ధాప్యంలో ప్రభుత్వం వారికి అండగా నిలవాలని కోరారు.

**వినతులు ఇచ్చినా స్పందన కరువు**

సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, సమాచార శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని సంఘం నాయకులు తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందన్నారు.

**సానుకూల నిర్ణయం తీసుకోవాలి**

వృద్ధాప్యంలో ఉన్న పాత్రికేయులకు పెన్షన్ పథకం ఎంతో అవసరమని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో వెటరన్ జర్నలిస్టులు, సీనియర్ పాత్రికేయులు, వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని స్వీకరించిన సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలకొండయ్య మాట్లాడుతూ.. జర్నలిస్టుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఉన్నతాధికారులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

# డీఎస్సీపై సిబిఐ విచారణ జరిపించాలి



**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో ఉన్న వైసిపి కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ మీరుగా బీసీసీ రోడ్డు గుండా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ పెద్ద ఎత్తున నిర్వహించారు. నినాదాలతో నిరసన ర్యాలీ దద్దరిల్లింది. ఈసందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ ఎపి .రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్సీపి వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్సీ ఎంపికలో జరిగిన అవినీతి అక్రమాలపై రిలే నిరాహార దీక్షలు 3 రోజులపాటు ముగించుకొని, గుంతకల్లు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డిల సూచనల మేరకు నిరసన ర్యాలీ నిర్వహించడం అయినదని, రాష్ట్ర కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వాహకంలో అక్రమాలు అవినీతి భారీగా చోటుచేసుకున్నాయని, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడాలని ప్రతిభగల డీఎస్సీ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వీటిపై సిబిఐ విచారణ జరిపించాలని, సంబంధిత మంత్రి నారా లోకేష్ తక్షణం రాజీనామా చేయాలని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి 3000 ఇవ్వాలని, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని, వసతి దీవెన బకాయిలు వెంటనే చెల్లించాలి, సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి, మాజీ టౌన్ కన్వీనర్ బొల్లు వెంకటరామిరెడ్డి, సూరి, రామకృష్ణారెడ్డి, పార్వతీశ్వరరెడ్డి, భాస్కరరెడ్డి, సాగర్ రెడ్డి, రామకృష్ణనాయక్, నీలూరు హరినాథ్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డి, రమణ ారెడ్డి, దామోదరరెడ్డి, అనిల్ కుమార్రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ మస్తానయ్య, ఓబుల ేసు, మీసాల రామచంద్ర, సుధాకర్, సాకే ఓబులేష్, రజాక్, సల్లా, రంగం వెంకటేష్, పుంజా. నాగేష్ యాదవ్, బెలకలరామిరెడ్డి, రెక్కల చంద్రశేఖరరెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, తుల్లా, నామదేవ్, జంగంలక్ష్మీనారాయణ, రంగనాయకులు, వెంకటరాముడు తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు విద్యార్థులు నిరుద్యోగులు విద్యార్థి సంఘాలు ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# శభాష్ డిస్కవర్ అనిల్ కుమార్...!

**- హెచ్ఎల్‌సీ కాలువలో భారీగా పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు**
**- 'డిస్కవర్ అనిల్ ' ఆధ్వర్యంలో 150 మంది పౌరుల శ్రమదానం**
**- 120 నిమిషాల్లో 5 వేల కిలోల వ్యర్థాల తొలగింపు**
**- కాలువల్లో చెత్త వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**
**- హెచ్ఎల్‌సీ కాలువపై అధికారుల ప్రత్యేక దృష్టి అవసరం**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** నగరంలోని హెచ్ఎల్సీ కాలువలో పెద్దఎత్తున చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. కాలువలో భారీగా వ్యర్థాలు పేరుకుపోయిన విషయాన్ని పర్యావరణ ప్రేమికుడు అనిల్‌కుమార్ గుర్తించారు. ఈ నేపథ్యంలో 'డిస్కవర్ అనంత' టీమ్‌కు చెందిన సుమారు 150 మంది నగర పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కాలువలోకి దిగి శ్రమదానం చేశారు. దాదాపు 120 నిమిషాల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో సుమారు 5,000 కిలోల చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.

**కాలువలా .. చెత్తకుప్పలా?**

నగరంలోని పలు ప్రాంతాల్లో కాలువలు, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడం సాధారణంగా మారుతోంది. వర్షాలు కురిసే సమయంలో ఈ వ్యర్థాలు కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారే అవకాశం ఉంది. దీంతో మురుగునీరు నిలిచిపోవడం, దోమలు పెరగడం, పరిసరాల్లో దుర్వాసన వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

**పౌరుల చొరవకు ప్రశంసలు**

కాలువలోకి స్వయంగా దిగి వేల కిలోల వ్యర్థాలను తొలగించిన 150 మంది పౌరుల చొరవపై పలువురు అభినందనలు వ్యక్తం చేశారు. కేవలం అధికారులు, పారిశుధ్య సిబ్బందిపైనే ఆధారపడకుండా ప్రజలు కూడా తమ పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

**అవగాహనతోనే పరిష్కారం**

కాలువల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేసే వారిపై సంబంధిత అధికారులు నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగాన్ని తగ్గించి, తడి--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

**అధికారుల దృష్టి సారించాలి**

ఒకసారి కాలువను శుభ్రం చేయడం కంటే తిరిగి చెత్త పేరుకుపోకుండా శాశ్వత చర్యలు చేపట్టడం ముఖ్యమని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు. హెచ్ఎల్సీ కాలువ పరిసరాల్లో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం, చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట పర్యవేక్షణ పెంచడం ద్వారా సమస్యను నియంత్రించవచ్చని వారు సూచిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యం, అధికారుల పర్యవేక్షణ రెండూ కలిసివస్తేనే అనంతపురాన్ని మరింత పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దగలమనే సందేశాన్ని ఈ శ్రమదానం చాటిచెప్పింది.



## ఉత్సవాలు ప్రశాంతంగా, సౌహార్ద వాతావరణంలో నిర్వహించాలి

**- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

**- వినాయక చవితి ఉత్సవాలపై కదిరి పట్టణ శాంతి కమిటీ సమావేశం**



**కదిరి - సూర్య వాస్తవం :** కదిరి పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు ఈ నెల 14-09-2026న ప్రారంభం కానున్న నేపథ్యంలో కదిరి పట్టణ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ పరస్పర సహకారంతో, శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వినాయక నిమజ్జనం నిర్వహణకు సంబంధించి గణేష్ మండ పాల నిర్వాహకులతో మరోసారి సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలను తెలుసుకున్న అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ఎన్ని రోజుల్లో పూర్తి చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో కళావతి , డీఎస్పీ శివ నారాయణ స్వామి , అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు , రూరల్ అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్ రెడ్డి , ఎమ్మార్వో రెడ్డి శేఖర్ , మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ , తదితర అధికారులు, గణేష్ మండపాల నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు... కదిరి పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు శాంతి, సౌభ్రాతృత్వం, సోదర భావంతో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

## పీహెచ్‌సీలో గర్భిణులకు తరిమెల వంశీ గోకుల్ రెడ్డి అన్నదానం



**సింగనమల -సూర్య వాస్తవం :** శింగనమల మండలం తరిమెల ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన గర్భవతులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులు వారి సహాయకులు ఆకలితో అలమటించకూడదనే మానవతా దృక్పథంతో వంశీ గోకుల్ రెడ్డి ఈ సత్కార్యానికి శ్రీకారం చుట్టారు.

**మానవత్వానికి నిదర్శనం:** చెక్-అప్ కోసం దూర ప్రాంతాల నుండి వచ్చే గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని ఏర్పాటు చేశారు.వైద్య సిబ్బంది అభినందనలు: రోగులు, గర్భిణుల సంక్షేమం కోసం నాయకులు ఇలా ముందుకు రావడం పట్ల ఆసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

**సేవా దృక్పథం:** సమాజ సేవలో వైసీపీ నాయకులు ఎల్లప్పుడూ ముందుంటారని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్య క్రమాలు కొనసాగిస్తామని వంశీ గోకుల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు (డాక్టర్లు), వైద్య సిబ్బందితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అరవింద నగర్‌లో ఘనంగా దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలు

**- బాబు, ప్రశాంతి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు**

**- దగ్గుపాటి ప్రసాద్‌కు వెల్లువెత్తిన జన్మదిన శుభాకాంక్షలు**





**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అరవింద నగర్ 30వ డివిజన్‌లో దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబు, ప్రశాంతి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా శ్రీ శ్రీ బాల ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రసాద్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యకర్తలు శ్రీధర్, అనిల్, ప్రతాప్, ప్రసాద్, లక్ష్మి, శ్రీదేవి, చంద్రకళ, పూజ, పర్వీనా తదితరులు పాల్గొని దగ్గుపాటి ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# వైసీపీ ఉద్యమంపై చంద్రబాబు ధమనకాండ!

**- డీఎస్సీ--2025 అవకతవకలపై న్యాయ విచారణ జరపాలి**

**- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎదురుదాడి చేయడం సరికాదన్న కెవి రమణ**

**- జన్‌జీ తిరుగుబాటు మరింత ఉధృతం చేస్తాం: వైసీపీ కె.వి. రమణ**



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** డీఎస్సీ--2025లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే చెల్లించాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాన్ని ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచి వేస్తోందని వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ ఆరోపించారు.గత ఆరో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమంలో భాగంగా సోమవారం నిర్వహించిన నిరసన ర్యాలీలను పలుచోట్ల పోలీసులు అడ్డుకున్నారని, అరెస్టులు, లాఠీచార్జీలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పుడు సమాధానం చెప్పాల్సింది పోయి ఎదురుదాడికి దిగడం సరికాదని విమర్శించారు. తాడిపత్రిలో పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని పోలీసులు అడ్డుకున్నారని రమణ తెలిపారు. అలాగే శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ పక్ష నాయకుడు బొత్స సత్యనారాయణను కూడా అడ్డుకు న్నారని అన్నారు. పులివెందులలో ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలపై పోలీసులు లాఠీచార్జి చేశారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనలు రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిస్థితులపై ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. డీఎస్సీ--2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా తమ ఉద్యమం కాదని, ఎంపిక ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై న్యాయ విచారణ జరిపించి అర్హులకు న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాత్రమే డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

“తప్పు జరగలేదని ప్రభుత్వం భావిస్తే విచారణకు ఎందుకు వెనుకాడుతోంది? జీవో నెం.76ను రద్దు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? స్పోర్ట్స్ కోటా ఎంపికల కోసం ప్రత్యేక జీవోలు ఎందుకు తీసుకురావాల్సి వచ్చింది?” అని రమణ ప్రశ్నించారు.అలాగే ట్రిపుల్ ఐటీలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.ప్రభుత్వం తమ ప్రశ్నలకు సమాధానం చెప్పే వరకు వైఎస్సార్‌సీపీ ఉద్యమం కొనసాగుతుందని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కె.వి. రమణ హెచ్చరించారు.

# డీఎస్సీ పై దుష్ప్రచారం.. గొడ్డలి పార్టీ మరో రాజకీయ డ్రామా

**- మాజీ టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్**



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలో అయన కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చెయ్యడం జరిగింది.ఈ సందర్భంగా వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో నిరు ద్యోగ యువతకు ఆశాకిరణంగా ని లిచేలా కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ పై గొడ్డలి పా ర్టీ మరో కొత్త డ్రామాకు తెరలేపడం హాస్యా స్పదంగా ఉంది. అధికారం లో ఉన్నప్పుడు నిరుద్యోగుల సమస్యలను పట్టించు కోకుండా,విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి,ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేసిన వారే ఇప్పుడు మెగా డీఎస్సీ పేరుతో రాజకీయ రాద్ధాంతం చేయడం ప్రజలు గమనిస్తు న్నారు.కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మెగా డీఎస్సీకి శ్రీకారం చు ట్టడం జరిగింది. ఉపాధ్యాయ ఉద్యో గాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారు. మెగా డిఎస్సీపై ఎలాంటి ఆధారా లు లేకుండా కోర్టుకి వెళ్ళి న్యాయ స్థానం చేతిలో చెంప చెల్లుమనించు కొని మీలాయర్లు క్షమాపణలు చెప్పి కేసు వెనక్కి తీసుకున్నా తరువాత కూడా ఇలాంటి డ్రామాలు ఆడడాని కి కొంచెం అయిన సిగ్గు ఉందా జగన్ రెడ్డి వాలంటరీ ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు అమ్ముకున్న ఘ నత మీ గొడ్డలి పార్టీది 2006 డిఎ స్సీ అక్రమాలు,గ్రూప్ 1 పేపర్ల గోల్ మాల్ కడప జెడ్పీ స్కామ్ ఇవన్నీ ని రుద్యోగులు జీవితాలతో జగన్ కు టుంబం చేసిన దగకు స్పష్టమైన ని దర్శనలు.మెగా డీఎస్సీ అంటే రాజ కీయ ప్రయోజనాల కోసం చేసే కార్య క్రమం కాదు.వేలాది మంది నిరుద్యో గ యువత భవిష్యత్తుతో ముడిపడిన అంశం. అందుకే పరీక్షా ప్రక్రియలో పారదర్శకత,నిబంధనల అమలు, మెరిట్ ఆధారంగా ఎంపిక వంటి అంశాలకు కూటమి ప్రభుత్వం ప్రాధా న్యత ఇచ్చింది.అర్హత ఉన్న అభ్యర్థి కి న్యాయం జరగాలి,ప్రతిభ ఉన్న వారికి ఉద్యోగం దక్కాలి అనేదే ప్ర భుత్వ లక్ష్యం.కానీ గొడ్డలి పార్టీకి మాత్రం యువతకు ఉద్యోగాలు రా వడం కూడా ఓర్వలేని పరిస్థితి కని పిస్తోంది. ప్రజలకు ఉపయోగపడే కా ర్యక్ర మాలను అభినందించాల్సింది పోయి,ప్రతి అంశాన్ని రాజకీయంగా మార్చి కొత్త కొత్త ఆరోపణలు చేస్తూ డ్రామాలు చేయడం వారి రాజకీయ సంస్కృతికి నిదర్శనం.అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ కోసం ఎదురు చూసిన నిరుద్యోగ యువతను పట్టించుకోని వారు.ఇప్పుడు మెగా డీ ఎస్సీపై మొసలి కన్నీరు కార్చడం ఎందుకు? ప్రజలకు సమాధానం చె ప్పాలి.గత ప్రభుత్వ హయాంలో ఉ ద్యోగాల కోసం యువత ఎన్నో ఇ బ్బందులు ఎదుర్కొన్న విషయం అం దరికీ తెలుసు.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటుంటే,దానిని స్వాగతిం చాల్సింది పోయి అడ్డంకులు సృష్టిం చే ప్రయత్నాలు చేయడం ఎంతవర కు సమంజసం చదువుకున్న యువతకు ఉద్యోగం రావాలి,ప్రతిభకు ప్రాధాన్యత దక్కాలి,అవినీతికి,అక్ర మాలకు తావులేకుండా నియామకా లు జరగాలి అనేదే కూటమి ప్రభు త్వ విధానం.ఈ విధానాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. గొడ్డలి పార్టీ ఎన్ని డ్రామాలు చేసినా నిరుద్యోగ యువ తను తప్పుదోవ పట్టించడం సాధ్యం కాదు.ఎవరు ఉద్యోగాలు కల్పించేం దుకు కృషి చేస్తున్నారో,ఎవరు ఉ ద్యోగాల పేరుతో రాజకీయాలు చేస్తు న్నారో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా తెలుసు. మెగా డీఎస్సీపై అనవసర ఆ రోపణలు చేయడం మానుకోవాలి. అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపట్టే ప్రతి చర్యకు సహకరించాలి. నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా, వారికి అండగా నిలవాలి.

యువత భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అనే ఆలోచనతో ముందుకు సా గుతున్న కూటమి ప్రభుత్వం. ఉద్యోగాల భర్తీ, విద్యా రంగం బలోపేతం, యువతకు మెరుగైన అవకాశాల కల్పనలో మరింత ముందుకు సాగుతుంది.

# డీఎస్సీ అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

**- గుత్తిలో వైసీపీ ఆధ్వర్యంలో డీఎస్సీ అక్రమాలపై నిరసన ర్యాలీ**

**- బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి**



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో డీఎస్సీలో జరిగిన అవినీతి,అక్రమాలపై సీబీఐ విచార ణ జరిపించాలని,డీఎస్సీ వ్యవహా రానికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర వి ద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీ నామా చేయాలని డిమాండ్ చేస్తూ గుత్తి వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో చేపట్టిన నిరసన,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ము ఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిఆ దేశాల మేరకు,గుంతకల్ ని యోజక వర్గ మాజీ శాసనసభ్యులు,ఇన్‌చార్జ్ వై.వెంకట్రామిరెడ్డి ఆదేశానుసారంపా ర్టీ పిలుపు మేరకు గుంతకల్ పట్ట ణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అ నంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో ఆగస్టు 6, 7,8 తేదీల్లో డీఎస్సీ అవినీతి,అక్ర మాలకు నిరసనగా నియోజకవర్గం కేంద్రలో రిలేనిరాహార దీక్షలు నిర్వ హించి,ఈ కార్యక్రమాల్లో డీఎస్సీ అ భ్యర్థులకు న్యాయం చేయాలని, డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకు న్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధి త అభ్యర్థు లకు న్యాయం చేయాలని కోరారు. ఈ రోజూ ఆగస్టు 10వ తే దీన పెద్ద ఎత్తున నిరసన కార్యక్ర మం చేపట్టడం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,మ హిళా నాయకురాలు,విద్యార్థి సం ఘాల నాయకులు, యువజన విభాగం నాయకులు పెద్ద సంఖ్యలో పా ల్గొని ఆర్ /బి బంగ్లా నుండి సత్రం మిట్ట వద్ద నుండి అంబేద్కర్ విగ్ర హం నుండి గాంధీ చోక్ మీదుగా కేపీ స్ థియేటర్ సర్కిల్ నుండి నేరుగా ఆర్/బి బంగ్లా వద్దకు ర్యాలీ చేయ డం జరిగింది.ర్యాలీ సందర్భంగా గు త్తి వైయస్సార్ పార్టీ నాయకులుమా ట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థులకు న్యా యం చేయాలని,డీఎస్సీ వ్యవహారం లో జరిగిన అవినీతి,అక్రమాలపై సీ బీఐతో సమగ్ర విచారణ జరిపించా లని,బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చే యాలని నినాదాలు చేశారు. డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరా టం కొనసాగు తుంద ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. డీఎస్సీని యామకాల్లో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, బాధిత అభ్యర్థులకు న్యాయం చే యాలని డిమాండ్ చేశారు.ఈ కార్య క్రమంలో ఎంపీపీ గుత్తి పట్టణ కన్వీ నర్ మాజీ పట్టణ కన్వీనర్ ఎక్స్ ఎం పీపీ ఎక్స మార్కెట్ యార్డ్ చైర్మన్ రా ష్ట్ర జిల్లా నియోజక వర్గ, పట్టణం, మండల పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పట్టణ, గ్రామ మండల నాయకులు, మహిళా నా యకురాలు విద్యార్థి సంఘాల నా యకులు, యువజన విభాగం నాయ కులు,పట్టణ గ్రామ కమిటీ అధ్యక్షు లు సభ్యులు పార్టీ కార్యకర్తలు వై ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్య క్రమం సందర్భంగా డీఎస్సీ అభ్యర్థు లకు న్యాయం చేయాలని, రాజ్యాంగ విలువలను కాపాడాలని నాయ కులు పిలుపునిచ్చారు.

## పరిమళ వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ పార్టీ నేతల ఘన నివాళి



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :**గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ నియోజకవర్గ ఇంచార్జి పరిమళ వెంకటేశ్వర్లు మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.సోమవారం గూడూరులో కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాల గురవం బాబు ఆయన భౌతిక కాయాన్నిసందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బాల గురవం బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం ఆయన చేసిన సేవలను,పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.పరిమళ వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులురెడ్డి,తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నంబాకం హరికృష్ణ,సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ దెయ్యాల కిరణ్ కుమార్,శ్రీకాళహస్తి నియోజవర్గ ఇన్చార్జ్ తపాల దామోదర్ రెడ్డి, తిరుపతి జిల్లా స్పోక్స్ పర్సన్ శీను గౌడ్,మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఫయాజ్,సూళ్లూరుపేట నియోజవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆవుల రమణ. ఎస్సీ సెల్ సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు,మండల నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ రహదారిపై కోళ్ల వ్యర్థాలతో ముక్కు మూసుకుంటున్న వాహనదారులు



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :**కలకత్తా-చెన్నై జాతీయ రహదారి పచ్చని చెట్ల మధ్య కోళ్లు వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.అవి కుళ్ళి కంపు కొట్టడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాయుడుపేట,సూళ్లూరుపేట పట్టణాల్లో ఏర్పాటు చేసుకున్న కోళ్ల మాంసపు విక్రయ దారులు, మరియు నెలబల్లి నుండి తల్లంపాడు టోల్ ప్లాజా వరకు జాతీయ రహదారికి ఇరుపక్కల రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకొని అందులో చికెన్ దుకాణాలు ఏర్పాటు చేసుకుని ప్రతి ఆదివారం దుకాణాలు చికెన్ అమ్మకాలు జరిపి చివరిగా ఆ వ్యర్థాలను, జాతీయ రహదారి ప్రక్క వదిలి వెళ్లడంతో అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి.కోళు వ్యర్థాలను సాంకేతిక పరంగా నిర్వీర్యం చేయకుండా సులభ మార్గంలో వాహనాలు తెచ్చి రోడ్ల పక్కన విడిచి వెళుతున్నారు.దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి-దొరవారిసత్రం గ్రామాల మధ్యలో ఉన్న రోడ్డు కిరువైపులా కోళ్ల వ్యర్థాలను తరచూ విడిచి పోతున్నారు.నిత్యం జాతీయ రహదారి భద్రతా తనిఖీ వాహనం రోడ్డుపై తిరుగుతుందో లేదో కానీ,ఇలాంటి చర్యలను కట్టడి చేయటంలేదు.ఇకనైనా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు జాతీయ రహదారులు గ్రీన్ కారిడార్లుగా,ప్రయాణికులు మంచి వాతావరణంలో ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని వాహనదారులు కోరుతున్నారు.

## సూళ్లూరుపేట లాడ్జీల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

### -14 జంటలను గుర్తించి పోలీస్ స్టేషన్ కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చిన.. ఎస్ఐ అజయ్ కుమార్



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణంలోని పలు లాడ్జీలపై ఎస్ఐ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 14 జంటలను గుర్తించి, వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ,?నిబంధనలు పాటించకుండా వ్యవహరించిన లాడ్జీల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.సూళ్లూరుపేట పరిధిలో ఉన్న లాడ్జిలలో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తప్పవని లాడ్జి యజమానులకు ఎస్సై అజయ్ కుమార్ హెచ్చరించారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో

# మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలి

### -మంత్రి సత్య కుమార్



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** మంగళగిరిలోని ఆఫిక్ భవనంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ 11 ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధికి సంబంధించిన డీ-స్కోపింగ్ ప్రతిపాదనలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడం,అత్యవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించడం, పీజీ సీట్లకు సంబంధించిన సిఎస్ఎస్ పథకం కింద పనుల పురోగతి, సివిల్ పనుల వ్యయం తదితర అంశాలపై చర్చించారు. అలాగే ఎస్ ఏ ఎస్ సి ఐ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలిస్తూ, 16వ ఆర్థిక సంఘం ద్వారా ఆరోగ్య రంగానికి లభించే నిధులను ఇప్పటికే ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల అవసరాలు, ప్రాధాన్యతల ఆధారంగా సమర్థవంతంగా వినియోగించుకునే అంశంపై దృష్టి సారించారు.అన్ని పనులకు స్పష్టమైన ప్రాధాన్యతలు నిర్దేశించి, అవసరమైన నిధుల సమీకరణతో పాటు నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పనుల పురోగతిపై వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించే సమగ్ర నివేదిక అందించాలని మంత్రి సూచించారు.ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి,వైద్య విద్య నాణ్యతను పెంపొందించడంతో పాటు ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## మెగా డీఎస్సీ కాదు....అది దగా డీఎస్సీ..

### - మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు...మాజీ మంత్రి వర్యులు, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాని గోవర్ధన్ రెడ్డి సూచనల మేరకు... డీఎస్సీ నియామకాల అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని,బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని,నిరుద్యోగ భృతిని పునరుద్ధరించాలని, నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సూళ్లూరుపేట శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో సోమవారం సూళ్లూరుపేట పట్టణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు,విద్యార్థులు,నిరుద్యోగ యువత, డీఎస్సీ బాధితులతో భారీ ర్యాలీ నిర్వహించారు.

సూళ్లూరుపేట పట్టణంలోని వినాయకుడి గుడి నుంచి మహదేవయ్య నగర్ మీదుగా కూరగాయల మార్కెట్,గడియార స్తంభం,గాంధీ బొమ్మ సెంటర్ వరకు భారీ నిరసన ర్యాలీగా కదం తొక్కిన వైయస్సార్సీపీ శ్రేణులు,యువత,విద్యార్థులు,డీఎస్సీ బాధితులు..ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ, డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామక వ్యవ హారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రెస్ మీటులలో క్లీన్ చీట్ ఇచ్చుకోవడం కాదని... వాస్తవాలను తేల్చాల్సింది దర్యాప్తు సంస్థలు మరియు కోర్టులని అన్నారు.నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ పై సిబిఐ విచారణకు ఆదేశించి తమ నిర్దోషిత్వాన్ని నిరూపిం చుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గారు డిమాండ్ చేశారు.డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో జరిగిన అవినీతి,అక్రమాలకు సంబంధించి అన్ని ఆధారాలను సిబిఐ ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బయటపడుతుందని, విచారణకు కూటమి ప్రభుత్వం ఎందుకు భయ పడుతుందని ప్రశ్నించారు.

1:1 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులకు కాల్ లెటర్లు ఇచ్చి, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం ఉద్యోగాలు ఇవ్వకపోవడంపై డీఎస్సీ అభ్యర్థుల్లో,యువతలో, విద్యార్థుల్లో తీవ్ర అభ్యంతరం వ్యక్తం అవుతున్నా ఈ కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు జెన్-జీ యువత రోడ్లపైకి వచ్చే పరిస్థితిని కూటమి ప్రభుత్వం సృష్టించిందని మండిపడుతూ.2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని స్పష్టం చేశారు.స్పోర్ట్స్ అసోసియేషన్ల పేరుతో నకిలీ సంఘాలు,నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం చోటు చేసుకుందని. ఈ వ్యవహారంలో రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బేరఫారాలు జరిగాయని ఆడియోలు వెలుగులోకి వచ్చిన విచారణ చేపట్టకపోవడం అను మానాలకు తావిస్తోందని అన్నారు.అక్రమాలపై సిబిఐ విచారణకు మంత్రి నారా లోకేష్ సిద్ధపడాలని సవాల్ విసిరారు. విద్యార్థులకు సంబంధించి పథకాల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి కింద ఒక్కొక్కరికి రూ.1.08 లక్షల బకాయిలను ఈ కూటమి ప్రభుత్వం ప్రతి నిరుద్యోగికి బాకీ పడిందని, ఆ బకాయిలను వెంటనే నిరుద్యోగ యువతకు చెల్లించాలని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని, రెండేళ్ల ప్రజా వ్యతిరేక పాలనతో అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయని.నిరుద్యోగుల జీవితాలతో ఈ కూటమి






ప్రభుత్వం చెలగాటమాడుతోందని.ఎక్కువ కాలం వీరి అవినీతి అక్రమాల సాగవు అని హితవు పలికారు,డీఎస్సీ మోసంపై గత నెల 31వ తేదీ నుంచి ఉద్యమిస్తుంటే ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మనకేంటి అన్నట్లు వ్యవహరించడం వారి బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట అని అభివర్ణించారు.ఇటీవల కేంద్రంలో నీట్ పేపర్ లీకేజీ పరిణామాలు నేపథ్యంలో తీసుకున్న చర్యలు వారికి గుర్తు రాకపోవడం శోచనీయమని, కొంచమైనా సిగ్గుండాలి అని.ఏ తప్పు చేయలేదు అని అనుకుంటే సిబిఐ విచారణకు ఒప్పుకోవాలని.నీట్ పేపర్ లీకేజ్ పై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తే.రాష్ట్రంలో జరిగిన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియా మకాల్లో అక్రమాలపై నారా లోకేష్ ఎందుకు రాజీనామా చేయరు అని ప్రశ్నించారు.సూళ్లూరుపేట పట్టణంలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ అబ్జర్వర్ బిరుదవోలు శ్రీకాంత్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట మండల అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి,నాయుడుపేట పట్టణ వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి,వైయస్సార్సీపీ ఎస్.ఈ.సీ సభ్యులు దబ్బల శ్రీమంత్ రెడ్డి,వైయస్సార్సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేనాటి సుమంత్ రెడ్డి,వైఎస్ఆర్సీపీ జిల్లా అధికార ప్రతినిధి కామిరెడ్డి రాజారెడ్డి,వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షులు మద్దాలి సోమశేఖర్ రెడ్డి మరియు జెట్టి వేణు యాదవ్,వైయస్సార్సీపీ ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ రెడ్డి,వైయస్సార్సీపీ సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షులు కృపాకర్ రెడ్డి వైయస్సార్సీపీ తడ మండల అధ్యక్షులు ఆర్ముగం,వైయస్సార్సీపీ దొరవారిసత్రం మండల అధ్యక్షులు అల్లూరు రాహుల్ రెడ్డి వైయస్సార్సీపీ నాయకులు వేణుంబాక మునిస్వామి నాయుడు మీజూరు రామకృష్ణారెడ్డి,¬ ఎల్లకూరు ఎంపీపీ శేఖర్ రెడ్డి, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ్ల ధనలక్ష్మి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర,జిల్లా,పట్టణ, మండల నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్య కర్తలు, యువత, విద్యార్థులు, డీఎస్సీ బాధితులు తది తరులు పాల్గొన్నారు.

- అధికారుల మౌనం
- మా పరిధి కాదు అంటున్న అధికారులు..
- గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న భూములు ప్రభుత్వ భూములు కాదా..మరి ఎవరివి
- సంబంధిత అధికారులు మౌనం ఎందుకు
- అధికారులు వెళ్లారు..చూసి వచ్చారు

## ప్రభుత్వ భూములలో అడ్డగోలు

# అక్రమ గ్రావెల్ త్రవ్వకాలు...

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** నియోజకవర్గంలో నేడు రాత్రి పగలు తేడా లేకుండా అడ్డగోలు అక్రమ గ్రావెల్ త్రవ్వకాల తరలింపు అడ్డగోలుగా సాగుతోంది.ప్రభుత్వ నిబంధనలు పాతర వేసి, అనుమతులు లేకున్నా గ్రావెల్ త్రవ్వకాలు అడ్డు అదుపు లేకుండా కొనసాగుతోంది. అవి ప్రభుత్వం భూములైన,ఇరిగేషన్ చెరువులైన, అటవీ భూములైన మాకు అడ్డే లేదన్నట్లు పార్టీ అండదండలతో,ప్రజా ప్రతినిధుల ఆశీస్సులతో అక్రమ గ్రావెల్ వ్యాపారాన్ని ధనార్జన దాహంతో మట్టి తరలిస్తున్నారు.ఇటీవల స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ ఇసుక,గ్రావెల్ తవ్వకాలపై ఉక్కు పాదం మోపాలని ఆదేశించిన ఆదేశాలు మున్నాళ్ళ ముచ్చటగా మారాయి.రెవిన్యూ,శాఖ అధికారులు ఎందుకు కట్టడి చేయడం లేదని ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాహాటంగా, బహిరంగంగా గత వారం రోజులుగా దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి రెవెన్యూ సర్వే నంబర్ 323/2, 324/1,332/2లా లో భూమి సుమారు 9 ఎకరాలు సింఫోలా టైల్స్ కంపెనీ సమీపంలో ఉంది.అది ప్రభుత్వ భూమిగా గ్రామస్తులు అంటున్నారు.

ఆ ఖాళీ భూమిపై కన్నేసిన అక్రమార్కుల అడ్డగోలు తవ్వకాలకు చదునైన భూమి అస్తవ్యస్తంగా మారుతుంది.రోజువారి పగలు రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలతో ప్రభుత్వ భూమి రూప రేఖలు మార్చేసి అవసరం ఉన్నంత లోతు తవ్వేసి, వందలాది యూనిట్ల మోతాదు గ్రావెల్ తరలిస్తూ కాసులు పోగేసు కుంటున్నారు.పట్టపగలేవు భారీ వాహనాల్లో మట్టి తరలిపోతున్న రెవెన్యూ,శాఖ అధికారులు అక్రమ గ్రావెల్ త్రవ్వకాల ప్రాంతాన్ని పరిశీలించి ఏ చర్యలు చేపట్టడం లేదని మండల ప్రజలు మండి పడుతున్నారు. భారీ స్థాయిలో మట్టి తరలించడానికి సుమారు పది ఎకరాల విస్తీర్ణాన్ని చదును చేసి సిద్ధం చేస్తున్నారు.అవినీతి అక్రమ గ్రావెల్ త్రవ్వకాలపై స్థానిక వీఆర్వో రమేష్,తాసిల్దార్ రాజేంద్ర కు సమాచారం చేరవేసిన ఏమీ తెలియనట్లు అవునా..నిజమా మాకు తెలియదే అన్న రీతిలో ప్రవర్తిస్తూ, విచారిస్తామంటూ తాపీగా సమాధానం చెప్పి దాటవేస్తున్నారు, ఒకవేళ గ్రావల్ తోలే ప్రదేశానికి వెళ్లిన, ఆ ప్రదేశము మనకు సంబంధం లేదు మంది కాదు వేరే మండలం అనడం లేదంటే మంది కాదు ఫారెస్ట్ అని తెలపడం,వంటి మాటలు ఆనవాయితీ అయిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి విషయాలు పై విచారించి చర్యలు చేపట్టి ప్రభుత్వ భూములను కాపాడాలని నెలబల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# 'మీ ప్రేమే నా బలం'..
# అభిమానులకు మహేశ్‌బాబు స్పెషల్ మెసేజ్!

**-పుట్టినరోజు శుభాకాంక్షలకు మహేశ్‌బాబు కృతజ్ఞతలు -అభిమానుల ప్రేమే తన బలమని పేర్కొన్న స్టార్ -'వారణాసి' తనకు చాలా ప్రత్యేకమని వ్యాఖ్య పుట్టినరోజున రుద్ర పాత్ర పోస్టర్లు విడుదల -ఆఫ్రికా షెడ్యూల్ చిత్రీకరణకు రాజమౌళి ప్రశంసలు ఏప్రిల్ 7న 'వారణాసి' విడుదల**



పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల నుంచి వచ్చిన ప్రేమకు టాలీవుడ్ స్టార్ మహేశ్‌బాబు కృతజ్ఞతలు తెలిపాడు. తన పుట్టినరోజు సందర్భంగా వెల్లువెత్తిన శుభాకాంక్షలతో మనసు నిండిపోయిందని చెప్పాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. అభిమానులను ఉద్దేశించి మహేశ్‌బాబు ప్రత్యేకంగా స్పందించాడు. "మీరు చూపించే ప్రేమే నా బలం. మీ అభిమానం నన్ను ఎంతో అదృష్టవంతుడిగా భావించేలా చేస్తోంది. మీ కోసం మరింత కష్టపడి పనిచేస్తా. మిమ్మల్ని మరింత గర్వపడేలా చేస్తా" అని పేర్కొన్నాడు. తన తదుపరి చిత్రం 'వారణాసి'పై కూడా మహేశ్‌బాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ సినిమా తనకు ఎంతో ప్రత్యేకమని చెప్పాడు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని చూసేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపాడు. మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా 'వారణాసి' చిత్రబృందం రెండు ప్రత్యేక పోస్టర్లను విడుదల చేసింది. ఇందులో రుద్ర పాత్రలో మహేశ్‌బాబు తొలిసారి కనిపించాడు. ఒక పోస్టర్‌లో దట్టమైన అడవిలో వెదురు తెప్పపై కనిపించగా.. మరో పోస్టర్‌లో ఆఫ్రికాలోని మసాయ్ మారా ప్రాంతంలో జిరాఫీలు, ఇతర వన్యప్రాణుల మధ్య కనిపించాడు. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నాడు. శ్రీదుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఐమ్యాక్స్‌లో వచ్చే ఏడాది ఏప్రిల్ 7న 'వారణాసి' విడుదల కానుంది.

## ముందు కాల్చి, తర్వాతే మాట్లాడతాం..
## 'స్లమ్‌డాగ్' నుంచి టబు పవర్‌ఫుల్ గ్లింప్స్!



విజయ్ సేతుపతి, పురి జగన్నాథ్ కాంబోలో వస్తున్న 'స్లమ్‌డాగ్'పవర్‌ఫుల్ ఆఫీసర్ గౌరీ హెగ్డేగా నటిస్తున్న టబు విడుదలైన క్యారెక్టర్ గ్లింప్స్‌కు అద్భుత స్పందన

షూటింగ్ పూర్తి చేసుకున్న సినిమా, శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పాన్ ఇండియా స్థాయిలో 5 భాషల్లో విడుదల కానున్న చిత్రం-స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్‌డాగ్ - 33 టెంపుల్ రోడ్'. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి, కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు క్యారెక్టర్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.



## తనకు కాబోయే భర్త ఎలా ఉండాలో చెప్పిన సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా

**తన తల్లిదండ్రుల బంధమే తనకు ఆదర్శమని చెప్పిన సారా టెండూల్కర్ స్నేహం, సరదా సంభాషణ ఉన్న వివాహ బంధాన్ని కోరుకుంటున్నట్లు వెల్లడి**

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ తన వివాహం, కాబోయే భాగస్వామి గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన తల్లిదండ్రులైన సచిన్, అంజలిల మధ్య ఉన్న స్నేహపూర్వక బంధమే తనకు ఆదర్శమని, తాను కూడా అలాంటి బంధాన్ని కోరుకుంటున్నానని ఆమె తెలిపారు. ప్రముఖ ఫ్యాషన్ మ్యాగజైన్ 'వోగ్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ అంశాలపై స్పందించారు. "మా అమ్మానాన్నలు భార్యాభర్తల కంటే ముందు మంచి స్నేహితులు. వారి మధ్య ఉండే సరదా సంభాషణలను నేను నిరంతరం గమనిస్తుంటాను. భవిష్యత్తులో నాకు లభించే భాగస్వామి నుంచి కూడా నేను అదే స్నేహాన్ని ఆశిస్తున్నాను" అని సారా వివరించారు. వారి మధ్య ఎటువంటి ఆధిపత్య ధోరణి ఉండదని, ఆ అన్యోన్యతే తనకు స్ఫూర్తినిస్తుందని ఆమె పేర్కొన్నారు. వివాహం విషయంలో సమాజం లేదా కుటుంబం నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లకు తలొగ్గి తాను తొందరపాటు నిర్ణయాలు తీసుకోనని సారా స్పష్టం చేశారు. భాగస్వామి సరైన వ్యక్తి కాదని భావిస్తే, నిశ్చితార్థం తర్వాత కూడా ఆ బంధం నుంచి తప్పుకోవడానికి జెన్-జీ వెనుకాడటం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. గత తరాల వారు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడానికి సంకోచించేవారని, కానీ నేటి యువత తమకు నచ్చని విషయాలను ధైర్యంగా వ్యక్తపరుస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది ఆరంభంలో తన సోదరుడు అర్జున్ టెండూల్కర్ వివాహం జరిగిందని, అది తనకు ఒక 'ట్రయల్ రౌండ్'లా ఉపయోగపడిందని ఆమె సరదాగా వ్యాఖ్యానించారు. గతంలో అట్టహాసంగా వివాహం చేసుకోవాలని అనుకున్నప్పటికీ, ప్రస్తుతం మాత్రం కొద్దిమంది సన్నిహితుల మధ్య నిరాడంబరంగా చేసుకోవాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. రొమాంటిక్ సోల్‌మేట్స్?పై తనకు నమ్మకం ఉన్నప్పటికీ, తన చిన్ననాటి స్నేహితులే తనకు నిజమైన సోల్‌మేట్స్ అని సారా చెప్పుకొచ్చారు.



# ఐసీసీపై మండిపడుతున్న చిన్న జట్లు..
# అసలేమిటీ వరల్డ్ కప్ ఫార్మాట్ వివాదం?




అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీసుకున్న ఒక అనూహ్య నిర్ణయం క్రికెట్ ప్రపంచంలో తీవ్ర దుమారం రేపుతోంది. పురుషుల వన్డే ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియలో, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఆకస్మికంగా మార్పులు చేయడంపై స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది అసోసియేట్ దేశాల (చిన్న జట్లు) క్రికెట్ అభివృద్ధికి పెద్ద దెబ్బ అని, ప్రపంచవ్యాప్తంగా ఆటను విస్తరించే ప్రయత్నాలకు ఇది గొడ్డలిపెట్టు అని హెచ్చరించాయి.

### ఏమిటీ కొత్త మార్పులు?

గత జులైలో ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ వార్షిక సమావేశం తర్వాత ఈ మార్పులను ప్రకటించారు.




వాస్తవానికి, ఈ టోర్నమెంట్‌లో 14 జట్లు పాల్గొనాలి. వాటిని ఏడేసి జట్లుగా రెండు గ్రూపులుగా విభజించి, ఆ తర్వాత 'సూపర్ సిక్స్' దశ నిర్వహించాల్సి ఉంది. కానీ, ఐసీసీ ఇప్పుడు 'సూపర్ సిరీస్', 'సూపర్ 7' అనే కొత్త దశలను ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానం ప్రకారం, క్వాలిఫయింగ్ రౌండ్‌లో చివరి మూడు స్థానాల్లో (12, 13, 14) నిలిచిన జట్లు మొదట 'సూపర్ సిరీస్' ఆడతాయి. ఇందులో గెలిచిన ఒక్క జట్టు మాత్రమే తర్వాతి దశకు అర్హత సాధిస్తుంది. ఆ తర్వాత, టాప్ 11 జట్లతో కలిసి మొత్తం 12 జట్లను ఆరేసి చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్ 3 జట్లతో పాటు, ఆ తర్వాత ఉత్తమ ప్రదర్శన కనబరిచిన మరో జట్టుతో కలిపి మొత్తం ఏడు జట్లు 'సూపర్ 7' దశలో ఆడతాయి. ఈ ఏడు జట్ల మధ్య జరిగే రౌండ్ రాబిన్ మ్యాచ్‌ల ఆధారంగా సెమీ ఫైనలిస్టులను నిర్ణయిస్తారు.

### చిన్న జట్లకు నష్టమా?

ఈ మార్పుల వల్ల అసోసియేట్ దేశాలు తీవ్రంగా నష్టపోతాయని స్కాట్లాండ్, నెదర్లాండ్స్ బోర్డులు ఆందోళన వ్యక్తం చేశాయి. టోర్నమెంట్ ప్రారంభానికి కేవలం 18 నెలల ముందు ఇలాంటి కీలక మార్పులు చేయడం దారుణమని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ముఖ్యంగా పరిమిత వనరులతో నడిచే చిన్న దేశాలపై ఇది పెను భారం మోపుతుంది. ఏళ్ల తరబడి ఒకే క్వాలిఫికేషన్ విధానం ఉంటుందని నమ్మి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు, శిక్షణ, ఆర్థిక ఏర్పాట్లు చేసుకున్న జట్లకు ఈ ఆకస్మిక మార్పులు కోలుకోలేని దెబ్బ. వారి ప్రణాళికలన్నీ తలకిందులవుతాయి. కొత్త ఫార్మాట్‌కు అలవాటుపడటానికి, వ్యూహాలు మార్చుకోవడానికి సమయం ఉండదు. ఇది వారిపై అదనపు ఆర్థిక, నిర్వహణ ఒత్తిడిని పెంచుతుంది. ప్రపంచకప్‌లో ఆడే అవకాశం వస్తేనే స్పాన్సర్లు, ప్రభుత్వాల నుంచి నిధులు, యువ ఆటగాళ్లలో స్ఫూర్తి వస్తాయి. కానీ, అర్హత సాధించే మార్గాన్ని ఇంత కఠినతరం చేస్తే, ఆ దేశాల్లో క్రికెట్ అభివృద్ధి కుంటుపడుతుంది.

### ఐసీసీ తీరుపై తీవ్ర విమర్శలు

"క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని చెబుతూనే, వర్ధమాన దేశాలకు అవకాశాలు తగ్గించడం తప్పుడు సంకేతాలు పంపుతుంది. కనీసం మాతో చర్చించకుండా, మా అభిప్రాయాలు తీసుకోకుండా ఇంత పెద్ద నిర్ణయం ఎలా తీసుకుంటారు?" అని బోర్డులు ప్రశ్నించాయి. ఈ నిర్ణయాల వెనుక పారదర్శకత లోపించిందని, ఇది అంతర్జాతీయ క్రికెట్ సమగ్రతను దెబ్బతీస్తుందని ఆరోపించాయి. ఈ మార్పుల గురించి ఎడిన్‌బర్గ్ సమావేశంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఇది తమకు పిడుగుపాటులాంటి వార్త అని ఓ అసోసియేట్ దేశ అధికారి తెలిపారు. మార్పుల ప్రకటన తర్వాత ఐసీసీతో రెండుసార్లు సమావేశమైనా, లిఖితపూర్వకంగా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, రెండు వారాలుగా ఐసీసీ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం నిరాశపరిచిందని, ఇది తమను అగౌరవపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశాయి. గతంలో అసోసియేట్ దేశాలు పెద్ద జట్లను ఓడించి సృష్టించిన సంచలనాలు టోర్నమెంట్‌కే వన్నె తెచ్చాయని గుర్తుచేశాయి. ఆటలో ప్రతిభే గెలవాలనే సూత్రానికి ఈ మార్పులు విరుద్ధమని పేర్కొన్నాయి. ఐసీసీ వెంటనే ఈ విషయంపై అసోసియేట్ సభ్యులతో చర్చలు జరిపి, ప్రపంచ క్రికెట్ ప్రయోజనాలను కాపాడాలని ఆ బోర్డులు డిమాండ్ చేశాయి.



## టీమిండియాలో చోటు కావాలంటే ఇదొక్కటే చేయి..

**- షమీకి జహీర్ ఖాన్ సూచన!**

**2027 ప్రపంచకప్‌కు భారత్ సన్నాహాలు**
**ఎప్పటిలా ఆటపై మాత్రమే దృష్టి సారించాలని షమీకి సూచన**
**జట్టుకు ఎలా ఉపయోగపడగలమన్నదే ముఖ్యమని హితవు**

టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీకి మరోసారి నిరాశ ఎదురైంది. గాయాల కారణంగా పలువురు ఆటగాళ్లు జట్టుకు దూరమవుతున్నా.. 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాలు మొదలైనప్పటికీ.. షమీ పేరు సెలెక్షన్ చర్చల్లో కనిపించడం లేదు. ఈ పరిస్థితిపై భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ స్పందించాడు. జట్టులోకి రావాలనుకుంటే షమీ తన చేతిలో ఉన్న పనిపైనే దృష్టి పెట్టాలని సూచించాడు. "ముందుకు ఎలా వెళ్లాలనేది షమీ నిర్ణయమే. మ్యాచ్‌లు ఆడుతూ బాగా రాణిస్తే జాతీయ జట్టుకు అందుబాటులో ఉన్నట్టే. ప్రస్తుతం జట్టు ఆలోచన మరోలా ఉండొచ్చు. కానీ ఆటగాడిగా మన ఆలోచన, మనం జట్టుకు ఎలా ఉపయోగపడగలమన్నది ముఖ్యం. షమీ ఇప్పుడు చేస్తున్నదే కొనసాగించాలి. మ్యాచ్‌లు ఆడటం, రాణించడం చాలా ముఖ్యం" అని జహీర్ చెప్పాడు. టీమిండియాలో పెరుగుతున్న గాయాలపైనా జహీర్ స్పందించాడు. జస్‌ప్రీత్ బుమ్రా వరుస సిరీస్‌లకు ఫిట్‌గా ఉండలేకపోతుండగా.. వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య వంటి ఆటగాళ్లు కూడా గాయాలతో ఇబ్బంది పడుతున్నారు. అయితే గాయాలు ఆటలో భాగమేనని జహీర్ అన్నాడు. ఆటగాళ్ల పని భారం తగ్గించడం అవసరమే అయినా.. పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించాడు. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్ గాయపడినప్పుడు తన చేతిలో ఉన్న విషయాలపై నియంత్రణ సాధించడం చాలా ముఖ్యమని చెప్పాడు. గాయానికి అసలు కారణం ఏంటో తెలుసుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలని సూచించాడు.

## నేషనల్ హైవే పక్కన
# అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలి

### -మండల తహసిల్దార్ కు ఎజీ గార్డెన్‌లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై వినతి పత్రాన్ని సమర్పించిన పలు జర్నలిస్టులు

**రాయచోటి-సూర్య వాస్తవం:** రాయచోటి పట్టణం, మదనపల్లె రోడ్, ఏజి గార్డెన్లోపాత్రికేయులకు ప్రభుత్వం ఫ్లాట్లను మంజూరు చేసింది. రాయచోటి పట్టణంలో ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్ను పడింది. మదనపల్లె రహదారి ప్రక్కనే ఏజి గార్డెన్ భూములు ఉండటంవల్ల ఈ ఫ్లాట్లకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో నకిలీ డి-పట్టాలతో కబ్జాలు చేసి పలువురు వి.ఆర్.ఓ, సర్వేయర్ ల సహాయంతో ఇష్టమొచ్చినట్లు కబ్జాలు చేసుకుంటూ, అసలైన లబ్ధిదారులు ఏందయ్యా అని ప్రశ్నిస్తే బెదిరించడం, చంపేస్తామని భౌతిక దాడులకు సైతం దిగుతున్నారని సీనియర్ పాత్రికేయుడు జైనుల్లా ఆబెద్దీన్ బాషా, (ఆంధ్రపత్రిక), చంద్రశేఖర్ (విశాలాంధ్ర), రామకృష్ణ (సూర్య), నవాజ్ షరీఫ్ (ప్రజాశక్తి), రమేష్ (హెచ్ఎంటీవీ), ఆదినారాయణ (99 టీవీ), మరి కొంతమంది జర్నలిస్టులు మండల తహసిల్దార్ అందుబాటులో లేని కారణంగా డిప్యూటీ తహసిల్దార్ కు కలిసి సోమవారం స్థానిక మండల కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు. ప్లాట్ నెం: 632 తూర్పు ముఖంగా దారి ఉండే ఇతని ప్లాట్ ఎదురు గా జాతీయ రహదారి (రోడ్డు) పక్కనే ఏదో గ్రామానికి చెందిన వ్యక్తి, రాయచోటి లో ఆధార్ కార్డు లేదు. రేషన్ కార్డు లేదు. దౌర్జన్యంగా ఆక్రమించుకుని నిర్మాణాన్ని చేపట్టారు. జర్నలిస్టు స్థలాలని, తెలిసిన అతనికి ఎటువంటి హక్కు లేకపోయినా పాత్రికేయుని స్థలంలో చొరబడి, ఇది నాకు సంబంధించిన ప్లాట్, దీనికి సంబంధించిన దృవపత్రాలను చూపించినా ఇది మా స్థలం, నేను కొన్నాను ఎవరికీ చెప్పుకుంటావో చెప్పుకో, నాకు రెవెన్యూ అధికారులే కట్టుకోమని చెప్పారని బెదిరిస్తున్నారని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఏదైనా మాట్లాడితే లేపేస్తామని బెదిరించి ఎటువంటి అనుమతి లేకున్నా నిర్మాణాలు చేపడుతున్నాడు. సదరు విషయమై చాలాసార్లు కలెక్టర్ కూడా సీరియస్ అయిన విషయం మనందరికీ తెలిసిందే. దయచేసి సదరు సీనియర్ పాత్రికేయునిపై జరిగిన అన్యాయంపై వెంటనే తగుచర్యలు తీసుకుని అక్రమ కట్టడాన్ని తొలగించి న్యాయం చేయాలని పాత్రికేయులు తహశీల్దార్ కు సమర్పించిన పట్ల పేర్కొన్నారు.





# పిజిఆర్ఎస్ అర్జీలు సకాలంలో త్వరితగతిన పరిష్కరించాలి

### ఇంఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం**

పి జి ఆర్ ఎస్ అర్జీలు సకాలంలో నాణ్యతతో త్వరితగతిన పరిష్కరించాలని ఇంఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి జిల్లా కలెక్టర్ తోపాటు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ వెంకటేష్, కెఆర్ఆర్సి ఎస్డిసి చంద్రశేఖర్ రెడ్డి, సర్వే శాఖ ఏడి శాంతరాజ్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంఛార్జి జిల్లా కలెక్టర్ మాటాడుతూ పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్-ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు.



**ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని.**

కురుబలకోట మండలం అంగళ్లు గ్రామపంచాయతీ పరిధిలోని కమతంపల్లి కు చెందిన జి నాగమణి తమ కుమార్తె జి. దివ్యశ్రీ పేరు మా ఇంటి పక్కన కాపురం ఉన్నటువంటి షేక్ జైనుబీ రేషన్ కార్డు లో నమోదు కాబడి ఉన్నది. ప్రస్తుతం ఇతరుల రేషన్ కార్డులో ఉన్నందున ప్రభుత్వం నుండి రావలసిన తల్లికి వందనం తదితర లబ్ధిని పొందలేక పోతున్నామని, ఈ విషయాన్ని తమరు పరిశీలించి వారి రేషన్ కార్డు నుండి తొలగించి, తమ రేషన్ కార్డు లో చేర్చాలని కోరుతూ ఇంఛార్జి జిల్లా కలెక్టర్ దరఖాస్తు సమర్పించారు. మొలకలచెరువు మండలం, కదిరినాధుని కోట గ్రామపంచాయతీ పరిధిలోని గాలేటి వారి పల్లెకు చెందిన పూజారి వెంకటప్ప 72 సంవత్సరాలు తను దివ్యాంగుడని నడవలేని స్థితిలో ఉన్న తనకు మూడు చక్రాల వాహనం మంజూరు చేయాలని కోరుతూ ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. .మదనపల్లె మండలం, పొన్నూటిపాళ్యం పంచాయతీ పరిధిలోని రవీంద్ర నగర్ ఎగువ కురవంకకు చెందిన బుల్లిమారి సరస్వతి తాను నేతపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, 'నేతన్న సేవలో' పథకం కింద రూ.25,000 ఆర్థిక సాయం మంజూరు కాలేదని తెలిపారు. అర్హత ఉన్నందున తనకు పథకం కింద ఆర్థిక సాయం మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 345 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## ఫిన్లాండ్ లో శిక్షణా కార్యక్రమానికి షేక్ జవహర్ మున్నీర్ ఎంపిక



**ప్రొద్దుటూరు -సూర్య వాస్తవం:** స్థానిక లింగారెడ్డి కొట్టాలు లోని మండల ప్రజా పరిషత్ స్కూలు ఉపాధ్యాయిని షేక్ జవహర్ మున్నీర్ ఆగస్టు 15న బయలుదేరి ఫిన్ ల్యాండ్ లో జరిగే శిక్షణా కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందుకున్నారు. ప్రాథమిక స్థాయిలో అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, అభ్యాస నైపుణ్యాలను బలోపేతం చేయడానికి ఆగస్టు 17 నుండి 26 తేదీ వరకు ఫిన్లాండ్ లో జరగబోయే ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమంలో షేక్ జవహర్ మున్నీర్ పాల్గొంటారు. మొత్తం 29 మంది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరవుతున్నారు. 2025 సెప్టెంబర్ 5వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా షేక్ జవహర్ మున్నీర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. కడప జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన షేక్ జవహర్ మున్నీర్ ని ప్రొద్దుటూరు ఎంఈఓ సావిత్రి, ఎంఈఓ-2 శోభా రాణి, పలువురు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావాలి

**- డీఐజీ డా.కోయ ప్రవీణ్ ఐపీఎస్**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** కర్నూలు రేంజ్ డీఐజీ డా. కోయ ప్రవీణ్ ఐపీఎస్ , జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ తో కలిసి సోమవారం పీలేరు పోలీస్ స్టేషన్, మదనపల్లి జిల్లా పోలీసు కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు అధికారులతో మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, సైబర్ నేరాలు, మహిళా భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్పీ గారు పీలేరు స్టేషన్ ఆవరణలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించి, దాని వినియోగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం డీఐజీ గారు మదనపల్లిలో వివిధ విభాగాల పనితీరును పరిశీలించి, సాంకేతికతను వినియోగించి కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, పలువురు సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులను మానసికంగా ఆర్థికంగా
# ఇబ్బంది కలిగిస్తే ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధం

### - యూటీఎఫ్ పిలుపు

**కదిరి - సూర్య వాస్తవం:** ఉపాధ్యాయులను టెట్ పేరుతో మానసికంగా, ఆర్థిక అంశాలను పరిష్కరించకుండా ఆర్థికంగా హింసించడం తగదని, ప్రభుత్వ తీరు ఇలాగే ఉంటే ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధమని, ఉపాధ్యాయులు సంక్షేమం, విద్యారంగ పరిరక్షణే ముఖ్యమని యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ తాహెర్ వలి, జిల్లా కార్యదర్శులు మల్లికార్జున, రవి వర్ధన్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం కదిరి ఎన్జీవో హోమ్ నందు ఆగస్టు 10 యూటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూటీఎఫ్ ప్రాంతీయ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 1974 ఆగస్టు 10వ తేదీన ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏర్పడిందని, ఆవిర్భావం నుంచి నేటి వరకు ప్రభుత్వాలు ఏవైనా పాలకులు ఎవరున్నా సమస్యల పరిష్కారంలో అలుపెరుగని పోరాటాలను నిర్వహిస్తూ రీ గ్రూపింగ్ స్కేల్స్ సాధన, మెరుగైన ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్, నోషనల్ ఇంక్రిమెంట్లు, అప్రెంటిస్ విధానం రద్దు, 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ లాంటి ప్రధానమైన సమస్యల పరిష్కారంలో కీలక భూమిక పోషించిందన్నారు. ఉపాధ్యాయుల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరచడంలో అలుపెరుగని పోరాట పటిమను ప్రదర్శించడమే కాక ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నడుం బిగించి ఊరి బడికి ఊపిరి నందించడంతో పాటు సామాజిక స్పృహను కలిగి ప్రకృతి వైపరీత్యాల ద్వారా సర్వం కోల్పోయిన వారికి అండగా నిలిచిందన్నారు. హక్కుల కోసం ఒకవైపు పోరాడుతూనే బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఉపాధ్యాయులకు కర్తవ్య బోధన చేయడం ఒక్క యుటిఎఫ్ కే సాధ్యమని తెలిపారు. యుటిఎఫ్ మొదటి తరం నాయకత్వం చెన్నుపాటి, మైనేని, అప్పారి, దాచూరి గార్ల అంకిత భావాన్ని, పోరాట పటిమను అందిపుచ్చుకొని నేడు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుటలో ముందుంటామని తెలిపారు. ఉపాధ్యాయులు బోధనేతర పనులతో సతమతమవుతున్నారని, ఒకవైపు అనవసరమైన యాప్‌ల భారం, మరొక వైపు మెడపై కత్తిలా టెట్ ను వేలాడదీసి మానసిక వేదనకు గురి చేస్తున్నారన్నారు. విద్యను ప్రైవేటీకరించడంలో భాగంగా పాఠశాలల మూసివేతకు ప్రభుత్వమే పరోక్షంగా కుట్ర పన్నుతున్నట్లుగా ఉందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చెల్లించాల్సిన డి.ఏలు,పి ర్ సి కమిటీ, సంపాదిత సెలవుల మంజూరు, మెడికల్ రీయంబర్స్మెంట్ మంజూరు, పొదుపు చేసుకున్న పీఎఫ్ సొమ్ములు చెల్లించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయవలసిన కూటమి ప్రభుత్వం అమలు చేయకపోగా రాష్ట్ర బడ్జెట్ మొత్తం ఉద్యోగ ఉపాధ్యాయులకే చెల్లిస్తున్నట్లు నమ్మబలకడం సరికాదన్నారు.

ఎన్నికల ముందు గౌరవ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం పి.ఆర్.సి కమిటీని వెంటనే నియమించి 30 శాతం ఐ.ఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులకు పెను సవాల్‌గా మారిన టెట్ రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. లేని పక్షంలో భవిష్యత్తు కార్యాచరణ ద్వారా పోరాట మార్గంలో ప్రభుత్వం మెడలు వంచైనా న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా సి.పి.ఎస్ సబ్ కమిటీ కన్వీనర్ సంతోష్ కుమార్, రెడ్డిరాజేష్,ఖాజా మోహియోద్దీన్, రమణ నాయక్, ఖాదర్ బాషా, నజీర్,బ్రహ్మేంద్ర, ఖాజపీర్,బాలాజీ నాయక్, వేంకటశివ, రామక్రిష్ణ ,హనీఫ్,రమేష్ బాబు,షరీఫ్,మహేశ్ రెడ్డి, షఫీ,బాబు,నాగరాజు, పవన్,శంకర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# రాకపోకలకు అడ్డంగా పాతిన విద్యుత్ స్తంభాలు

- రాకపోకలకు అడ్డంగా పాతిన విద్యుత్ స్తంభాలు
- అన్నదాతకు విద్యుత్ శాఖ అధికారుల శాపం
- ప్రశ్నార్థకంగా మారిన పంటల సాగు ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు





**ఆర్లగడ్డ -సూర్య వాస్తవం:** ఆర్లగడ్డ నియోజకవర్గం శిరివెళ్ల మండలంలోగుండంపాడు గ్రామంలో ఆరుగాలం శ్రమించి ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసే అన్నదాతకు విద్యుత్ శాఖ అధికారుల స్వార్థం అవకాశవాదం నిర్లక్ష్యం అన్నదాతకు శాపం అయింది. పొలాల్లోకి ట్రాక్టర్ గాని పంట కోత మిషన్లు గానీ వెళ్లకుండా రాకపోకలు కొనసాగించే తెలుగు గంగ నడి కట్టపై విద్యుత్ స్తంభాలను యదేచ్ఛగా పాతి పెట్టిన సంఘటన శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామంలో చోటు చేసుకున్నది. పక్కనున్న రైతులు ఏమైపోతే నాకేంటి నా పొలం పండితే చాలు నా పొలానికి విద్యుత్ సరఫరా ఉంటే చాలు విద్యుత్ అధికారుల కొటేషన్ ఉన్నా లేకున్నా విద్యుత్ ప్రమాదంలో రైతులు మృతి చెందితే ఎవరేమీ పీకలేరు అన్న చందంగా తెలుగు గంగ 16వ బ్లాకు కాలువ కట్ట పై విద్యుత్ స్తంభాలను పాతిన సంఘటన సంచలనం రేపుతున్నది. సుమారు 25 ఎకరాలకు పైగా పంటల సాగు ప్రశ్నార్థకంగా మారనున్నదని కనీసం ఎద్దుల బండ్లు సైతం పోలేని విధంగా విద్యుత్ స్తంభాలు పాతి పక్క రైతుల కష్టాలను నష్టాలను ఇబ్బందులను ఆలోచించడం లేదని బాధిత రైతులు పెద్ద సుబ్రమణ్యం,చిన్న సుబ్బయ్య, సుమిత్ర, వెంకట సుబ్బయ్య,గోవర్ధన్ స్వామి,వెంకట స్వామి,లక్ష్మీ దేవి, బాల సుబ్రహ్మణ్యం తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా ఎస్పీ దొరవారు నంద్యాల జిల్లా కలెక్టర్ వారు తెలుగు గంగ అధికారులు నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ ఏడి వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా స్పందించి పంటల సాగుకు ప్రతిబంధకాలుగా పాతిన విద్యుత్ స్తంభాలను తొలగించి పేద మధ్యతరగతి సామాన్య రైతులు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

- పివిఎన్ మాధవ్ జన్మదిన సందర్భంగా అన్నదానం




**డోన్ -సూర్య వాస్తవం :** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం ) ఆధ్వర్యంలో సోమవారం డోన్ పట్టణంలో "హర్ ఘర్ తిరంగా తిరంగా ర్యాలీ" ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహం నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ డోన్ పాత బస్టాండ్‌లోని సమైక్యాంధ్ర కట్ట వరకు కొనసాగింది. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సునీల్ రెడ్డి, డోన్ మున్సిపల్ కమిషనర్ శ్రీ కసిరెడ్డి నరేష్ కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు, బీజేవైఎం నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలతో దేశభక్తిని చాటారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం నంద్యాల జిల్లా అధ్యక్షులు సీలివెరీ వెంకటేష్ రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ శ్రీ సుబ్బరాజు , బీజేవైఎం నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ శ్రీ బొమ్మన విజయ్ , బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ సందు వెంకటరమణ బీజేపీ డోన్ మండల అధ్యక్షులు శ్రీ బొంకురి రవికుమార్ బీజేపీ డోన్ పట్టణ అధ్యక్షులు బద్రి సుధాకర్ పాల్గొన్నారు. పివిఎన్ మాధవ్ జన్మదిన సందర్భంగా అన్నదానం హర్ ఘర్ తిరంగా ర్యాలీ అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు శ్రీ పివిఎన్ మాధవ్ గారి జన్మదినాన్ని పురస్కరించుకొని డోన్ పాత బస్టాండ్ సమైక్యాంధ్ర కట్ట వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.




ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా నాయకులు పివిఎన్ మాధవ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో బీజేపీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శులు సొప్పాకుల విజయ్ భాస్కర్ , వంశీ గౌడ్ , బుగ్గన కావ్య శ్రీ రెడ్డీ,నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సందు అరుణ్ కుమార్ నంద్యాల జిల్లా కార్యదర్శి శ్రీ ఎద్దుల హరినాథ్ రెడ్డి నంద్యాల జిల్లా కోశాధికారి శ్రీ రాజపుత్ కమలేష్ తదితర బీజేపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పందికోన రిజర్వాయర్ కాలువల పనులు పూర్తి చేసి రైతులకు నీరు అందించాలి

## -హంద్రీ--నీవా ద్వారా తాలూకాలోని అన్ని చెరువులను నీటితో నింపాలి :సీపీఐ




**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :**పత్తికొండ: పందికోన రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువల పనులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే హంద్రీ--నీవా ప్రాజెక్టు ద్వారా పత్తికొండ తాలూకాలోని అన్ని చెరువులను నీటితో నింపి రైతులకు సాగునీటి భరోసా కల్పించాలని కోరారు.సీపీఐ చేపట్టిన "బద్లావ్ జరూరీ హై"- మార్పు కావాలి అంటూ జరిగే పాదయాత్ర నాలుగో రోజు పులికొండ, పందికోన గ్రామాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలను కలిసి వారి సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ సీనియర్ నాయకులు గురుదాస్, సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కారన్న హాజరై వారు మాట్లాడుతూ...., కర్నూలు రోడ్డు నుండి పులికొండ గ్రామం వరకు రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. పులికొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగస్వామి దేవస్థానం ఉందని, ఈ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారని తెలిపారు. భక్తులు, గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారి నిర్మాణానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిరుద్యోగ యువకులకు ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకపోతే ప్రత్యాయంగా నిరుద్యోగ భృతి కింద మూడు వేల రూపాయలు ఇవ్వాలనిఅలాగే దళితులు, ఆదివాసులపై జరుగుతున్న ఆకృత్యాలు, దాడులను వెంటనే అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అణగారిన వర్గాలకు రక్షణ కల్పించి, వారి హక్కులను కాపాడాలని అన్నారు.బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఎన్నికల విధానంపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.పందికోన రిజర్వాయర్, హంద్రీ--నీవా కాలువల పనులను పూర్తి చేసి సాగునీరు అందించడం, గ్రామీణ రహదారుల నిర్మాణం, యువతకు ఉద్యోగాలు, దళితులు--ఆదివాసుల రక్షణ వంటి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని అలాగే ఈ నెల 18వ తేదీన జరిగే కలెక్టరేట్ ముట్టడికి ఆ గ్రామాల నుండి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమానికి సిపిఐ పందికోన గ్రామ శాఖ కార్యదర్శి రవి అధ్యక్షతన గారు జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెద్ద ఈరన్న కొత్తపల్లి గిడ్డయ్య గౌడ్ నెట్టికంటయ్య వెంకట్ రాముడు సిపిఐ మండల సహాయ కార్యదర్శి జోహారాపురం కాశీ రైతు సంఘం మండల అధ్యక్షులు పెద్ద ముని కొత్తపల్లి శాఖ కార్యదర్శి హనుమంతు వ్యవసాయ కార్మికుల నియోజకవర్గ కార్యదర్శి ఉరుకుంద ప్రజా సంఘాల నాయకులు సిద్దు ఉపేంద్ర చారి పెద్దయ్య రవి కౌలిట్ల ఓబులేషు దస్తగిరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీలో ఏం జరిగింది? సమగ్ర విచారణ జరపాలి

- నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆటలొద్దు.. అవకతవకలపై సమాధానం చెప్పాలి
- డీఎస్సీ వ్యవహారంపై బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి:మాజీ మంత్రి డా. సాకే శైలజానాథ్- డీఎస్సీలో జరిగిన అవకతవకులపై వైసీపీ భారీ ర్యాలీ.. భారీగా కదలివచ్చిన వైసీపీ శ్రేణులు




**సింగనమల- సూర్య వాస్తవం :** మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయంటూ వైఎస్ఆర్‌సీపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని, మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డా.సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దమ్మ గుడి నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో డీఎస్సీ ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు ఎల్ యం మోహన్‌రెడ్డితో పాటు నియోజకవర్గ ఆయా మండలాల మండల అధ్యక్షులు, వైఎస్ఆర్‌సీపీ వివిధ అనుబంధ సంఘాల రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ నాయకులు, జిల్లా నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.మాజీ మంత్రి డా. సాకే శైలజానాథ్ మాట్లాడుతూ మెగా డీఎస్సీలో అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ప్రక్రియపై అభ్యర్థుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు, అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. వేలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన హెచ్చరించారు. మెగా డీఎస్సీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ప్రక్రియపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని వైఎస్ఆర్‌సీపీ నేతలు స్పష్టం చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు.

# డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై వైఎస్సార్‌సీపీ భారీ నిరసన

- ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తీవ్ర విమర్శలు
- నారా లోకేష్ రాజీనామా చేయాలి: మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి




**ఉరవకొండ - సూర్య వాస్తవం:** డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా ఉరవకొండలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో జిల్లా అధికార ప్రతినిధి సి పి వీరన్న, విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు మంజునాథ్ రెడ్డి, రాకెట్ల అశోక్, సాకే పురుషోత్తం,విద్యార్థులు, నిరుద్యోగ యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ టవర్ క్లాక్ సర్కిల్ వరకు కొనసాగింది. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు నినాదాలు చేశారు. అనంతరం టవర్ క్లాక్ సర్కిల్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో విశ్వేశ్వరరెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

**సీబీఐ విచారణ జరపాలి**

డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి చదువుకుని ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడటం దారుణమని ఆరోపించారు."డీఎస్సీ నియామకాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీబీఐ విచారణకు ఆదేశించి ప్రభుత్వం తన నిజాయితీని నిరూపించుకోవాలి" అని ఆయన అన్నారు. ప్రభుత్వం నిరసనలను అణచివేసే ధోరణిని విడనాడాలని కోరారు.

**స్పోర్ట్స్ కోటాపైనా ఆరోపణలు**

స్పోర్ట్స్ కోటా నియామకాల్లో కూడా అక్రమాలు జరిగాయని విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు సిఫారసు చేసిన వారికే ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీఈడీ అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం టెట్ వంటి పరీక్షలు రాయాల్సి ఉండగా, కొందరికి ఎలాంటి పరీక్షలు లేకుండానే ఉద్యోగాలు కల్పించారనే ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.డీఎస్సీ ప్రశ్నపత్రం లీక్ అయిందనే ఆరోపణలపై కూడా సమగ్ర దర్యాప్తు అవసరమని ఆయన అన్నారు. మెరిట్ జాబితా, పరీక్షా ప్రక్రియ, ప్రశ్నపత్రం తయారీ, కంప్యూటర్‌లోకి అప్‌లోడ్ చేసిన విధానం తదితర అంశాలపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

**అర్హులైన ప్రతి అభ్యర్థికి న్యాయం చేయాలి**

డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం తేలిగ్గా తీసుకోకుండా తక్షణమే విచారణకు ఆదేశించాలని విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. అర్హత ఉన్న ప్రతి డీఎస్సీ అభ్యర్థికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత, క్రీడాకారుల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాడుతుందని విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి
- మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీగా మారింది
- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య




**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** డీఎస్సీ నియామకాలలో జరిగిన అవకతవకలపై సమగ్రంగా సీబీఐ విచారణ జరిపించాలని, ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతిని పునరుద్ధరించడంతో పాటు నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి సూచనలతో సోమవారం సూళ్లూరుపేట పట్టణంలో డీఎస్సీ బాధితులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలతో కలిసి కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వినాయకుడి గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ మహదేవయ్య నగర్ మీదుగా కూరగాయల మార్కెట్, గడియార స్తంభం మీదుగా గాంధీ బొమ్మ సెంటర్ వరకు సాగింది. డీఎస్సీ నియామకాల్లో న్యాయం చేయాలని, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని నినాదాలు చేస్తూ పార్టీ శ్రేణులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, డీఎస్సీ బాధితులు ర్యాలీలో పాల్గొన్నారు.

**ప్రెస్‌మీట్లలో క్లీన్‌చీట్ ఇచ్చుకోవడం కాదు**

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ.. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రెస్‌మీట్లలో క్లీన్‌చీట్ ఇచ్చుకోవడం వల్ల వాస్తవాలు బయటకు రావని అన్నారు. ఆరోపణలపై నిజానిజాలు తేల్చాల్సింది దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలని పేర్కొన్నారు. ప్రభుత్వానికి నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై సీబీఐ విచారణకు ఆదేశించి, తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలకు సంబంధించి తమ పార్టీ వద్ద ఉన్న ఆధారాలను దర్యాప్తు సంస్థల ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**విచారణకు ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది?**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో 1:1 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులకు కాల్ లెటర్లు ఇచ్చి, సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఉద్యోగాలు ఇవ్వకపోవడంపై అభ్యర్థులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సంజీవయ్య విమర్శించారు.

స్పోర్ట్స్ అసోసియేషన్ల పేరుతో నకిలీ సంఘాలు, నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, ఈ వ్యవహారంలో రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బేరసారాలు జరిగినట్లు పేర్కొంటున్న ఆడియోలు వెలుగులోకి వచ్చినప్పటికీ సమగ్ర విచారణ చేపట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ ఆరోపణలపై సీబీఐ విచారణకు మంత్రి నారా లోకేష్ సిద్ధపడాలని సవాల్ చేశారు.

**నిరుద్యోగ యువతకు బకాయిలు చెల్లించాలి**

నిరుద్యోగ భృతిని పునరుద్ధరించాలని సంజీవయ్య డిమాండ్ చేశారు. ఒక్కో నిరుద్యోగికి రూ.1.08 లక్షల మేర ప్రభుత్వం బకాయి పడిందని ఆరోపిస్తూ, ఆ మొత్తాన్ని వెంటనే నిరుద్యోగ యువతకు చెల్లించాలని కోరారు. విద్యార్థులకు సంబంధించిన వివిధ పథకాల బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని, నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే మరింత తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

**జెన్–జీ యువతను రోడ్డుపైకి తెచ్చారు**

కూటమి ప్రభుత్వ విధానాల వల్ల జెన్–జీ యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేసే పరిస్థితి ఏర్పడిందని సంజీవయ్య విమర్శించారు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. రెండేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని, తెలుగుదేశం పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని అన్నారు. అవినీతి, అక్రమాలు ఎక్కువ కాలం కొనసాగవని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని స్పష్టం చేశారు.

**డీఎస్సీ ఉద్యమాన్ని ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు?**

డీఎస్సీ వ్యవహారంపై గత నెల 31వ తేదీ నుంచి నిరుద్యోగులు, బాధితులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోనట్లుగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట అని సంజీవయ్య అన్నారు.

దేశవ్యాప్తంగా పరీక్షలు, నియామకాలలో అవకతవకలపై తీవ్ర చర్చ జరుగుతున్న సమయంలో రాష్ట్రంలో డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం తేలికగా తీసుకోవడం సరికాదన్నారు. ఎలాంటి తప్పు జరగలేదని ప్రభుత్వం భావిస్తే సీబీఐ విచారణకు అంగీకరించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

**కేంద్రంలో ఒక న్యాయం.. రాష్ట్రంలో మరో న్యాయమా?**

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర స్థాయిలో తీసుకున్న చర్యలను ప్రస్తావించిన సంజీవయ్య.. పరీక్షలు, నియామకాలకు సంబంధించిన అవకతవకలపై బాధ్యత వహించే వారు జవాబుదారీతనం ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో నారా లోకేష్ ఎందుకు రాజీనామా చేయరని ప్రశ్నించారు.

"మెగా డీఎస్సీ అని చెప్పి నిరుద్యోగులకు ఆశలు కల్పించి.. ఇప్పుడు నియామకాల విషయంలో అన్యాయం చేస్తే యువత ఎలా ఊరుకుంటుంది? డీఎస్సీపై వస్తున్న ప్రతి ఆరోపణను సమగ్రంగా విచారించి బాధితులకు న్యాయం చేయాలి. సీబీఐ విచారణకు ప్రభుత్వం సిద్ధపడాలి. అప్పుడే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి" అని సంజీవయ్య అన్నారు.

**భారీగా పాల్గొన్న పార్టీ శ్రేణులు**

ఈ నిరసన ర్యాలీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు బిరుదవోలు శ్రీకాంత్ రెడ్డి, సూళ్లూరుపేట మండల అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి, నాయుడుపేట పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, రాష్ట్ర ఎస్ఈసీ సభ్యులు దబ్బల శ్రీమంత్ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేనాటి సుమంత్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కామిరెడ్డి రాజారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మద్దాలి సోమశేఖర్ రెడ్డి, జెట్టి వేణు యాదవ్, ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ రెడ్డి, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షులు కృపాకర్ రెడ్డి, తడ మండల అధ్యక్షులు ఆర్ముగం, దొరవారిసత్రం మండల అధ్యక్షులు అల్లూరు రాహుల్ రెడ్డి, పెళ్లకూరు ఎంపీపీ శేఖర్ రెడ్డి, నాయుడుపేట నెలవల రవి, ఎంపీపీ కురుగొండ్ల ధనలక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మునిస్వామి నాయుడు, మీజూరు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, డీఎస్సీ బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఘనంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలు

- ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు
- 50 డివిజన్లు, 4 పంచాయతీల్లో భారీగా సంబరాలు







**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తూ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రాంనగర్ 80 అడుగుల రోడ్డు నుంచి అర్బన్ టీడీపీ కార్యాలయం వరకు సందడి వాతావరణం నెలకొంది. నగరంలోని 50 డివిజన్లు, 4 పంచాయతీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపు కున్నారు. పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**మూడు పూటలా అన్నదానం**

దగ్గుపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని మూడు అన్న క్యాంటీన్లలో మూడు పూటలా ఉచిత భోజనాన్ని అందించారు. టీడీపీ నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్ తదితరులు అన్న క్యాంటీన్లలో భోజనం వడ్డించారు.

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు**

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేరు మీద నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోర్టు రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో టీడీపీ నాయకుడు కేశవ నాయుడు 101 టెంకాయలు కొట్టారు. ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొవ్వూరు నగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో టీడీపీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి, వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర నాయకుడు మణిరవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సేవా కార్యక్రమాలు**

జీసస్ నగర్‌లో సరిపూటి రమణ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. పాతూరులోని రెడ్‌క్రాస్‌లో క్లస్టర్ ఇన్‌చార్జ్ కాయగూరుల శ్రీధర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. మాజీ ఆర్టీసీ గౌరవ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు మున్నా నగర్ రమేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అరవింద్ నగర్‌లోని వృద్ధాశ్రమంలో దుప్పట్లు, మంగళవారి కాలనీలో చీరలు పంపిణీ చేశారు. నారాయణపురంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ డిష్ నాగరాజు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గౌటుకూరులోని బెరాకా ఆశ్రమంలో ఓంకార్ రెడ్డి ఆధ్వర్యంలో, బ్లైండ్ హాస్టల్‌లో క్లస్టర్ ఇన్‌చార్జ్ వన్నూరప్ప ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మాజీ నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందించారు. రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో కూడా కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో నగరంలో ఎటు చూసినా 'జై దగ్గుపాటి' నినాదాలు మారుమోగాయి.

**ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు**

ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో తమకు రెండున్నరేళ్ల పరిచయమే ఉన్నప్పటికీ, ఆయన ఎంతో ఆప్తుడిగా మారారని తెలిపారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో ప్రత్యేక అభిమానాన్ని సంపాదిం చుకున్నారని పేర్కొన్నారు. ఎవరికైనా సమస్య ఎదురైతే వెంటనే స్పందించే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. దగ్గుపాటి ప్రసాద్ నాయకత్వంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని, పార్టీని మరింత బలోపేతం చేస్తామని టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు.